

మొక్కను నాటి నీళ్లు పోస్తున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

రోజంతా వాన..

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30 : ఒక్కటే వాన... ఎక్కడా తెరిపివ్వలేదు.. శుక్రవారం రాత్రి 1 గంట నుంచి చినుకులు పడుతూనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 17 మండలాల్లో గడచిన 24 గంటలుగా అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరిపిలేని వాన కురుస్తూనే ఉంది. జిల్లాలో 67.6 శాతం వర్షం కురిసింది. అత్యధికంగా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో గోకవరం మండలంలో 11.4 మి.మీ వర్షం కురవగా అత్యల్పంగా సీతానగరం మండలంలో 1.0 మి.మీ వర్షం కురిసిందని వాతావరణ శాఖ తెలిపింది. అనపర్తిలో 7.2 మి.మీ, కడియం 5.0 మి.మీ, బిక్కవోలు 3.4 మి.మీ, రాజానగరం 3.4 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్ 3.2 మి.మీ, రంగంపేట 2.6 మి.మీ, రాజమహేంద్రవరం 2.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కొవ్వూరు డివిజన్‌లో ఉండ్రాజవరం 5.2 మి.మీ, పెరవలి 5.0 మి.మీ, తాళ్ళపూడి 3.8 మి.మీ, గోపాలపురం 3.4 మి.మీ, చాగల్లు 3.2 మి.మీ, కొవ్వూరు 3.2 మి.మీ, దేవరపల్లిలో 2.6 మి.మీ, నిడదవోలు లో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. శుక్రవారం రాత్రి వర్షం చెదురుమొదురు జల్లులుగా కురిసింది.



ఆగని వాన : వానలో తడుస్తూ వెళుతున్న ప్రయాణికులు

వనోత్సాహం..
ఊరూ వాడా వనమహోత్సవం

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 : మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని, ప్రధానంగా విద్యార్థి దశ నుంచే పిల్లల్లో ఇది అలవాటుగా మారాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల లక్ష్మీ దుర్గేష్ అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో శుక్రవారం అటవీశాఖ నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో ఆయన మొక్క నాటారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ ప్రశాంతి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దుర్గేష్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఆక్సిజన్‌ను అందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసే మొక్కలను పెంచాలన్నారు. పెరిగిన చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఈ వనమహోత్సవం కార్యక్రమాన్ని ఒక పండుగలా రాష్ట్రమంతటా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు కళాశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థి దశ నుంచే మొక్కల సంరక్షణ, బాధ్యత వారికి తెలియజేయవచ్చని ఈ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబరు 2న పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని సమాజహిత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవాన్ని ఒక్క రోజుతోనే పరిమితం చేయకుండా దాదాపు 60 రోజుల పాటు జరిగేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే,జిల్లా ఫారెస్ట్ అధికారి బి.నాగరాజు, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, ఆర్డీవో కేఎల్ శివజ్యోతి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అడిషనల్ ఎస్పీగా శ్రీనివాసులు



రాజమహేంద్రవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్)గా కె.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఆయన ఇప్పటి వరకూ నార్త్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు.రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు ఉద్యోగోన్నతి కల్పించారు. దీనిలో భాగంగా శ్రీనివాసులును అడి షనల్ ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో శ్రీనివాసులు మంచి అధికారిగా పేరు తెచ్చుకున్నారు. అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రాజశేఖరరావు, ఎక్సైజ్ (పాత సెబ్) అడిషనల్ ఎస్పీ పిట్టా సోమశేఖరరావుకు ఎస్పీ(నాన్ క్యాడర్)గా ఉద్యోగో న్నతి కల్పించారు. రాజశేఖరరావును ఏసీబీకి, సోమశేఖరరావును కాకినాడ జిల్లా ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు. ప్రభు త్వ రైల్వే పోలీసు రాజమహేంద్రవరం సబ్-డివిజన్ డీఎస్పీ ఎల్.మోహ న్‌రావుకు అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించి అనకాపల్లి జిల్లా క్రైమ్ విభాగానికి బదిలీ చేశారు.



కార్పొరేషన్ గలీజు!
రాజమహేంద్రవరంలో మాయాజాలం

- 24 ఏళ్లుగా షాపుల వేలం హుష్‌కాకి
- రెన్యువల్‌కే అధికారుల ప్రాధాన్యం
- అసలు కంటే కొసరు ఎక్కువ
- 60 శాతం సబ్ లీజుదారులే
- ముగిసిన 104 షాపుల గడువు
- ఏడాదైనా నేటికీ కానరాని వేలం
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- పెట్టి షాపుల అద్దె రూ.420
- కార్పొరేషన్ ఆదాయానికి గండి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30 : వాణిజ్య రాజధాని రాజమహేంద్రవరం..ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు ఇదే పెద్ద మార్కెట్.. బంగారం నుంచి బట్టల వరకూ ఏది కొనాలన్నా పెద్ద ఎత్తున రాజమహేంద్రవరం తరలివస్తారు. దీంతో ప్రతి రోజూ కోట్లలో వ్యాపారం సాగుతోంది.. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నగరంలో షాపు అద్దెలు పేలిపోతాయి అనుకుంటున్నారా..? ప్రైవేటులో అయితే మీరన్నది నిజమే.. నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లు మాయా ప్రపంచంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సుమారు 24 ఏళ్ల కిందట లీజుకు తీసుకున్నవారు సబ్ లీజులకు ఇచ్చి అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. షాపుల వేలం పాట మొదలుకొని కేటాయింపుల వరకు అన్నింటిలోను దళారీ వ్యవస్థ పాతుకుపోయింది. కార్పొరేషన్ షాపులు కొంత మంది అధికారులు, దళారులకు ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి.ఇదంతా ఒక మాయాప్రపంచంగా మారిపోయింది. దీంతో అర్హులకు అవకాశం లేకుండా పోతోంది. ఇది గత కొన్నేళ్లుగా యథేచ్ఛగా సాగుతున్నా ఏ అధికారి ఆ షాపుల లీజు వ్యవహారంపై పట్టించుకున్న దాఖలాలే లేవు.

ఆ 104 షాపుల సంగతేంటో..

రాజమహేంద్రవరంలో కార్పొరేషన్‌కు 251 షాపులు ఉన్నాయి. ఒక్కో షాపునకు తక్కువలో తక్కువ రూ.10 వేలు వేసుకున్నా రూ.25 లక్షల వరకూ ఆదాయం రావాలి. ఆ లెక్కన ఏడాదికి రూ.3 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. సుమారు 25 ఏళ్ళ కిందట అంటే 1999-2000లో 50 శాతం షాపుల ను లీజుకు ఇచ్చారు. ప్రతి ఐదేళ్లకోసారి షాపులకు వేలం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే గత 24 ఏళ్లుగా వేలం అనేది లేకుండా షాపులను రెన్యువల్ చేసుకుంటూ పోతుండడంతో అద్దెలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. 251 షాపుల్లో 104 షాపులకు లీజు గడువు ముగిసి అర్ధసంవత్సరం దాటింది. ఈ షాపులను వేలంపాట ద్వారా మళ్లీ లీజుకు ఇవ్వాల్సి ఉన్నా ఆ ప్రయత్నాలే కానరావడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా షాపుల వేలం పాట అంశం తెరపైకి రావడం లేదు. 104 షాపులు లీజు గడువును దాటి కొనసాగుతున్నాయి. దీని వల్ల కార్పొరేషన్ ఆదాయం పెరగడం కన్నా పాత లీజుల పద్ధతే కొనసాగి నష్టం వాటిల్లుతోంది. ఇందతా అధికారులకు తెలిసినా చర్యలు మాత్రం కానరావడంలేదు.

షాపుల్లో సగం సబ్ లీజుదారులే

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లు అంటే కొందరికి పెట్టుబడిలేని వ్యాపారంగా మారింది. నగరపాలక సంస్థలో లీజులు దక్కించుకున్న వారిలో 60 శాతం మంది ఆయా షాపుల్లో వ్యాపారాలు చేయరు. వాటిని సబ్‌లీజులకు ఇచ్చి నెలనెలా ఆదాయం పొందుతున్నారు. వాస్తవానికి అన్ని అర్హతలు ఉండి కూడా వ్యాపారాలు చేసేందుకు నేరుగా అవకాశాలు లేక కొంత మంది దళారీల చేతిలో పడి సబ్ లీజులకు షాపులను తీసుకునే పరిస్థితి ఉంది. నగరంలో షాపుల అద్దె విషయానికి వస్తే పెట్టి షాపు రూ.420 మొదలు కొని మంచి సెంటర్‌లో ఉన్న ఒక్కో షాపునకు అత్య ధికంగా రూ.35,271 వరకు నెలవారి అద్దె రూపంలో నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుంది. ఈ అద్దెలు ప్రైవేటు షాపులతో పోల్చుకుంటే చాలా తక్కువ.

నాడు వేలం అడ్డుకున్న వైసీపీ..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు వచ్చే ప్రధాన ఆదాయాల్లో షాపుల వేలంపాట ఒకటి. ఈ వేలం పాటు ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం పెరుగుతుంది. ఆస్తులు, ఖాళీ స్థలాలు, భూముల ద్వారా ప్రతి ఏటా నగరపాలక సంస్థకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తుంది. కాని గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన తీరు నగరపాలక సంస్థకు నష్టాలను తెచ్చిపెట్టింది. మాజీ ఎంపీ భరత్ రామ్ ఎన్నికల ముందు నగరంలో కార్పొరేషన్ షాపుల వేలం జరగనివ్వకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అధికారులు రూల్స్‌ను బ్రేక్ చేస్తూ షాపుల వేలం నోటిఫికేషన్ ఇవ్వకుండా సైలెంట్ అయ్యారు. పోనీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాతైనా వీళ్లు కదలడంలేదు. ఇప్పటికైనా కూటమి నాయకులు కళ్లు తెరవాలి. దళారులుగా మారిన వారి బారి నుంచి మునిసిపల్ షాపులను రక్షించాలి.అర్హులకు వేలంపాట ద్వారా షాపులు కేటాయిస్తే దళారి వ్యవస్థ పూర్తిగా కనుమరుగవుతుందని నగర పౌరులు అంటున్నారు.

కార్పొరేషన్‌కు 251 షాపులు

నగరంలో కార్పొరేషన్‌కు 251 షాపులు ఉన్నాయి. గోకవరం బస్టాండ్‌లో 19 షాపులు ఉండగా ఎస్సీలకు 3, ఎస్టీలకు 1 దివ్యాంగుల కోటాలో 1, ఇతరులకు 14 షాపులు లీజుకు ఇచ్చారు. లేపాక్షి షోరూం వద్ద 20 షాపులు ఉండగా ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, దివ్యాంగులకు 1 , ఇతరులకు 16 ఇచ్చారు. శివ జ్యోతి థియేటర్ వద్ద 15 షాపులు ఉండగా ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, దివ్యాంగులకు 1 మిగిలిన 11 ఇతరులకు ఇచ్చారు. టౌన్ హాలు ఎదురుగా కార్పొరేషన్ షాపులు 8 ఉండగా వాటిలో ఎస్సీలకు 1, ఎస్టీలకు 1, దివ్యాంగులకు 1, మిగిలిని 5 షాపులు ఇతరులకు కేటాయించారు. కోటిపల్లి బస్టాండ్ కొవ్వూరు రోడ్డులో 16 షాపులు ఉండగా ఎస్సీలకు 1 ,మిగిలినవి ఇతరులకు కేటాయించారు. జాంపేట బజార్‌లో 25 షాపులు ఉండగా ఎస్సీలకు 4, ఎస్టీలకు 2, దివ్యాంగులకు 1, ఇతరులకు 18 షాపులు కేటాయించా రు. ఎంఎ మార్కెట్‌లో 24 షాపులు ఉండగా ఎస్సీలకు 2, దివ్యాంగులకు 2, ఇతరులకు 22 షాపులు కేటాయించారు. జాంపేట గాంధీ బొమ్మ ఎదురుగా ఉన్న షాపిం గ్ కాంప్లెక్స్‌లో 10 షాపులు ఉండగా ఎస్సీలకు 1 ,మిగిలిన 9 ఇతరులకు కేటాయించారు. మునిసిపల్ స్టేడియం వద్ద 55 షాపులు ఉండగా ఎస్సీలకు 8, ఎస్టీలకు 3, దివ్యాంగులకు 2 , ఇతరులకు 42 షాపులు కేటాయించారు. నటరాజ్ థియేటర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 7 షాపులు ఉండగా 1 ఎస్సీలకు మిగిలిన 6 ఇతరులకు కేటాయించారు. ఎస్‌కేవీటీ స్కూల్ వద్ద 7 షాపులు ఉన్నాయి. బైపాస్ రోడ్డులో 45 షాపులు ఉండగా అందులో పది ఖాళీగా ఉన్నాయి. మిగిలినవాటిలో 7 ఎస్సీలకు, 3 ఎస్టీలకు ,10 షాపులు దివ్యాంగులకు , 15 షాపులను ఇతరులకు కేటాయింపులు చేశారు.



ర్యాంపుల వద్ద చెక్‌పోస్టులు పెట్టండి : జేసీ



కొవ్వూరులో ర్యాంపు పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు, సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు,ఆగస్టు 30 : డీసిల్టేషన్ ఇసుక ర్యాంపుల వద్ద పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలని జేసీ ఎస్.చిన్నరాముడు అధికారులను ఆదేశించారు. కొవ్వూరు మండలం వాడపల్లి, పట్టణ పరిధిలోని ఔరంగాబాద్, ఏరినమ్మ,ఫ్యాక్టరీ ర్యాంపు, దండకుంటరేవు ఇసుక ర్యాంపులను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కొవ్వూరు మండలం వాడపల్లి, ఔరంగాబాద్ ఇసుక ర్యాంపుల వద్ద ఉన్న రెండు మార్గాల్లో ఒక మార్గాన్ని మూసివేయాలన్నారు. ర్యాంపులోపలికి వెళ్లే మార్గం వద్ద పోలీసు చెక్‌పోస్టుతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు ఫ్యాక్టరీ ర్యాంపు ను తాత్కాలికంగా మూసివేయాలన్నారు. ఆయన వెంట ఏడీ మైన్స్ సుబ్రహ్మణ్యం, కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఇన్ చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు సిబ్బంది ఉన్నారు.



టీచర్ల ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ అరుణకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్‌డీవోకు కేఎల్ శివజ్యోతికి వినతిపత్రం అందజేశారు. తక్షణమే కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు, కార్యదర్శి కె.రమేష్ బాబు, సీహెచ్ దయానిధి, వీఎస్ ప్రకాశరావు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జ్వరపీడితులకు అన్ని పరీక్షలు చేయాలి : డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 : వైద్యశిబిరాల్లో జ్వరపీడితులకు అన్ని పరీక్షలు నిర్వహించి పూర్తి వివరాలు నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరావు ఆదేశించారు. రాజమహేంద్రవరం లాలాచెరువు వాంబేగృహాల వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య వైద్య శిబిరాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అద్దేపల్లి కాలనీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ తెలిపారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా హరినారాయణ్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30 : జిల్లా ప్రత్యేక అధికారిగా 2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఎం.హరినారాయణన్‌ను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు తీరును పరిశీలించేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఐఏఎస్‌లను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ జీవో నెం 1495ను జారీ చేసింది. దీనిలో భాగంగా హరినారాయణ్‌ను జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రస్తుతం డీఎంఏగా పనిచేస్తున్నారు.

కేఎఫ్‌సీలో మరుగు నూనె వాడేస్తున్నారు..
క్యాన్సర్ వచ్చే ప్రమాదం : విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి

రాజమహేంద్రవరం,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని హోటళ్లు/రెస్టారెంట్లలో మరుగు నూనెను ఎక్కువగా వాడుతున్నారని విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం వంట నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్(టీపీసీ) మీటరు రీడింగు 25% ఉండాలని.. కానీ రీడింగు ఎక్కువగా ఉంటున్నట్టు తమ తనిఖీల్లో బయట పడుతోందన్నారు.ఈ విధమైన నూనె వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. శుక్రవారం కేఎఫ్‌సీ రెస్టారెంట్, పందలపాక అప్పారావు(సత్య పంచ కళ్యాణి) పలావు హోటల్స్‌లో తనిఖీలు చేయగా రెండిటిలోనూ రీడింగు ఎక్కువగానే ఉందన్నారు. ఆహార పదార్థాల నమూనాలను ల్యాబ్‌కి పంపించడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ జగన్నాథరెడ్డి,డీసీటీవో నవీన్‌కుమార్,ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య పాల్గొన్నారు.



తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో మహిళల సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

నిడదవోలు, ఆగస్టు 30 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్‌వీకేఏ శర్మ సుమారు 1500 మంది ముత్తయిదువులచే వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. దేవస్థానం వారిచే ముత్తయిదువులకు పసుపు కుంకుమ గాజులు ప్రసాదం అమ్మవారి ఫొటో అందజేసారు. సుమారు 3000 మందికి అన్నప్రసాదం వితరణ చేసినట్టు ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.



సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



శ్రావణలక్ష్మీ రావమ్మా... వరాలివ్వమ్మా

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు... భక్తజనసంద్రమైన పిఠాపురం పాదగయ క్షేత్రం

పిఠాపురం, ఆగస్టు 30: దక్షిణ కాశీగా ప్రసిద్ధి గాంచిన పాదగయ క్షేత్రం శ్రావణ శోభతో విరాజిల్లింది. మహిళా భక్తులతో కిటకిటలాడింది. వేద పండితుల మంత్రోచ్చారణలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించిన వరలక్ష్మీ వ్రతాల్లో పాల్గొనేందుకు వర్షంలోనూ మహిళలు భారీగా తరలివచ్చారు. పూజల్లో పాల్గొన్న వారికి డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన చీరలు, పసుపు, కుంకుమ అందజేశారు.

కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. అష్టాదశ శక్తి పీఠాల్లో దశమ శక్తి పీఠానికి అధిష్ఠాన దేవత అయిన పురుహూతికా అమ్మవారు, ఆదిశంకరాచారులు ప్రతిష్ఠించిన రాజరాజేశ్వరీదేవి, స్వయంభూ కుక్కుటేశ్వర స్వామి సన్నిధిలో వ్రతాలు ఆచరించేందుకు మహిళలు భారీగా తరలివచ్చారు. తొలుత మూడు బ్యాచ్‌లుగా వ్రతాలు నిర్వహించాలని భావించినా మహిళలు అధికంగా తరలిరావడంతో ఉదయం ఐదు నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నాలుగు విడతలుగా వ్రతాలు జరిపించారు. ఆలయ ప్రాంగణం, దత్తాత్రేయ మండపం, చండీ హోమ ప్రదేశం, సరస్వతీదేవి మందిరం సహా ఆలయమంతా మహిళలు కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. జనసేన ప్రధాన కార్యదర్శి కొణిదల నాగబాబు సతీమణి పద్మజతో పాటు ఆరు వేల మందికి పైగా మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించారు.

వేదమంత్రోచ్చారణలతో శ్రావణ లక్ష్మికి శాస్త్రోక్తంగా పూజలు జరిగాయి. వ్రతంలో పాల్గొన్న భక్తులకు కొబ్బరికాయ, గాజులు, పసుపు, కుంకుమ, అరటి పళ్లు, పువ్వులు తదితర పూజా సామగ్రి, చీర, జాకెట్టు, వరలక్ష్మి రూపు అందజేశారు. అనంతరం పులిహోర, చక్రపొంగలి ప్రసాదం ప్యాకెట్లు పంపిణీ చేశారు. పాదగయ క్షేత్రంలో వస్తున్న సంప్రదాయం, ఆనవాయితీకి అనుగుణంగా చీరలు, పసుపు, కుంకుమ, గాజులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం ఎమ్మెల్యే పవన్‌కల్యాణ్ సమకూర్చారు. వీటిని భక్తులకు జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మజ, ఎమ్మెల్సీ హరిప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు.

శుక్రవారం తెల్లవారుజాము నుంచి ఎడతెరిపి లేని వర్షం కురుస్తున్నా భక్తులు భారీగా తరలివచ్చారు. తొలి బ్యాచ్ ఉదయం 5 గంటలకు ప్రారంభిస్తామని ప్రకటించడంతో అప్పటికే క్యూలైన్లలోకి చేరారు. క్యూలైన్ నుంచి ఆలయంలోకి వెళ్లే చోటే చీరలు, సామగ్రి అందజేశారు. వర్షం తగ్గకపోవడంతో టెంట్ల నుంచి నీరు కారడంతో కొంత ఇబ్బంది కలిగింది.

పిఠాపురం నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండానే భావనతో సంప్రదాయాన్ని గౌరవిస్తూ వ్రతంలో పాల్గొన్న ప్రతి ఆడపడుచుకు పవన్ కల్యాణ్ చీర, గాజులు, పసుపు, కుంకుమ పంపించారని ఎమ్మెల్సీ హరిప్రసాద్ తెలిపారు. వరలక్ష్మీ వ్రతాల్లో కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బుర్రా కృష్ణంరాజు, జనసేన నాయకులు, వీర మహిళలు, జన సైనికులు, ఆలయ ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవాని, పిఠాపురం సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.



వ్రతమాచరిస్తున్న జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు సతీమణి పద్మజ






వ్రతమాచరిస్తున్న ఈవో, సహాయ కమిషనరు దుర్గాభవాని

రత్నగిరిపై ఘనంగా ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

అన్నవరం, ఆగస్టు 30: శ్రావణ మాసం చివరి శుక్రవారం అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించిన సామూహిక వరలక్ష్మీ వ్రతాలకు కాకినాడ జిల్లా నలుమూలల నుంచి అశేష సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. ఉదయం 8 గంటలకు నిత్య కల్యాణ మండపంలోని ప్రత్యేక వేదికపై సత్యదేవుడు, అనంతలక్ష్మీ అమ్మవారిని, మరో వేదికపై సిరులిచ్చే వరలక్ష్మీ దేవిని ఆశీనులు గావించారు. దేవస్థానం పీఆర్వో కృష్ణారావు, ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం జ్యోతిప్రజ్వలనతో వ్రతాలను ప్రారంభించారు. వ్రత పురోహిత ముఖ్యుడు చామర్తి కన్నబాబు ఆధ్వర్యంలో మహిళలతో గణపతి పూజ, పుణ్యాహవచనం, అమ్మవారికి అష్టోత్తర, శతనామ పూజ చేయించారు. చతుర్వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. 6,200 మంది మహిళలు వ్రతాల్లో పాల్గొన్నారని ఆలయ అధికారులు వెల్లడించారు. వారందరికీ జాకెట్టు ముక్క, అమ్మవారి గాజులు, ప్రసాదంతో పాటు ఉచిత దర్శనం కల్పించి అన్న ప్రసాదాలు అందజేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏపీఆర్వో ఎం.గణపతి, సూపరింటెండెంట్ స్వామీజీ ఏర్పాట్లు చేశారు.



ప్రత్యేక వేదికపై ఆశీనులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవారు, వరలక్ష్మీ దేవి (ఫైల్), వ్రతమాచరిస్తున్న మహిళలు



ఎమ్మెల్సీ పదవికి, వైసీపీకి పద్మశ్రీ రాజీనామా

ఆమె బాటలోనే మరికొంతమంది మాజీ కార్పొరేటర్లు!



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తన పదవికి, వైసీపీకి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఆమె శాసనమండలి చైర్మన్‌కు శుక్రవారం అందజేశారు. పద్మశ్రీ మత్స్యకార మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలిగా, మత్స్యకార సంక్షేమ సమితి మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలిగా పనిచేసి వైసీపీలో చేరారు. 2023 మార్చిలో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆమెను గవర్నర్ కోటా నుంచి వైసీపీ అభ్యర్థిగా ప్రకటించారు. ఆగస్టు 9న ఎమ్మెల్సీగా నియమిస్తూ అప్పటి రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కాగా పద్మశ్రీ బాటలోనే మరికొంతమంది వైసీపీ నాయకులు, మాజీ కార్పొరేటర్లు పార్టీకి రాజీనామా చేసే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి వైసీపీ నేతలు ఎవరూ బయటకు కనిపించకపోవడంతో ఈ అనుమానాలు మరింత ఎక్కువవుతున్నాయి.



పోస్టర్ విడుదల చేస్తున్న ప్రో చాన్సలర్ సతీష్‌రెడ్డి

13, 14 తేదీల్లో 'ఆదిత్య వేద-2కే24' టెక్ ఫెస్ట్

గండేపల్లి, ఆగస్టు 30: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్శిటీ ఆధ్వర్యంలో ఆదిత్య వేద-2కే24 పేరిట జాతీయ స్థాయి టెక్ ఫెస్ట్‌ను సెప్టెంబరు 13, 14 తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రో చాన్సలర్ డాక్టర్ ఎస్.సతీష్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన పోస్టర్‌ను విడుదల చేశారు. వివిధ విభాగాల్లో పేపర్, పోస్టర్, ప్రాజెక్టు ప్రజెంటేషన్, క్విజ్ పోటీలు జరుగుతాయని, విజేతలకు నగదు, జ్ఞాపిక ప్రశంసాపత్రం అందజేస్తామని చెప్పారు. రాష్ట్రంలో పాటు ఇతర రాష్ట్రాల్లోని ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులకు పోటీల్లో పాల్గొనాలని ఆహ్వానం పంపామని చెప్పారు. కార్యక్రమంలో యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎంబీ శ్రీనివాస్, ప్రో వైస్ చాన్సలర్ డాక్టర్ ఎస్.రమాశ్రీ, రిజిస్ట్రార్ డాక్టర్ జి.సురేష్, స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ డాక్టర్ డోలా సంజయ్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదిరెడ్డి రమేష్, డీన్ వి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రేప్ కేసులో ముద్దాయికి

పదేళ్ల జైలు

ఉప్పలగుప్తం, ఆగస్టు 30: రేప్ కేసులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లి పంచాయతీ పెదరాఘవులపేటకు చెందిన కొప్పాడి నాగరాజు(31)కు కోర్టు పదేళ్ల జైలు శిక్ష విధించింది. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... 2012లో పెదరాఘవులపేట ఎంపీపీ పాఠశాలలో విద్యా వలంటీరుగా పని చేసిన నాగరాజు సహచర వలంటీరు అయిన అదే గ్రామానికి చెందిన ఓలేటి కుమారి (31)ని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా అనుభవించాడు. అనంతరం పెళ్లికి ససేమిరా అనడంతో మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు 2019లో పోలీసులకు ఫిర్యాదు చేసింది. అప్పటి ఉప్పలగుప్తం ఎస్ఐ ఎన్.సన్యాసినాయుడు కేసు నమోదు చేశారు. వాదోపవాదాల అనంతరం నేరం నిర్ధారణ కావడంతో సెషన్స్ కోర్టు జడ్జి వై.బెన్నయ్యనాయుడు ముద్దాయికి పదేళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

13 మంది బాలికలు డిశ్చార్జి

ఏలేశ్వరం, ఆగస్టు 30: కాకినాడ జిల్లా ఏలేశ్వరంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 24 మందిలో 13 మందిని శుక్రవారం డిశ్చార్జి చేశామని ఏలేశ్వరం ప్రభుత్వ ఆసుపత్రి సూపరిటెండెంట్ శైలజ తెలిపారు. మిగిలిన 11 మందికీ మెరుగైన వైద్యం అందిస్తున్నమని, త్వరలోనే కోలుకుంటారని ఆమె చెప్పారు.

నమ్మించి మోసం చేశాడు

ఒడిసా చేపల వ్యాపారి కిడ్నాప్‌తో రూ.4.50 కోట్లు నష్టపోయాం

అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న బాధిత రైతులు

అమలాపురం టౌన్, ఆగస్టు 30: రైతుల చెరువుల వద్ద నుంచి చేపలను పెద్ద మొత్తంలో దఫదఫాలుగా కొనుగోలు చేసి సొమ్ములు చెల్లిస్తామని మోసగించిన ఒడిసా చేపల వ్యాపారి సంజయ్ కలాసీని పోలీసులు తక్షణం అదుపులోకి తీసుకుని తమను ఆదుకోవాలని కోరుతూ శుక్రవారం రాత్రి ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలకు చెందిన బాధిత రైతులు పలువురు అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. రైతులకు సొమ్ములు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఒడిసాకు చెందిన సంజయ్ కలాసీని గురువారం కొందరు కిడ్నాప్ చేశారన్న సమాచారంతో రైతులు మరోసారి రోడ్డెక్కారు. చేపల వ్యాపారి కిడ్నాప్‌కు, తమకు ఎటువంటి సంబంధం లేదన్నారు. ఎస్.యానంకు చెందిన స్వామినాయుడు సహకారంతోనే మూడేళ్ల క్రితం సంజయ్ కలాసీకి సరుకు ఇచ్చామన్నారు. సొమ్ములు అప్పుడు చెల్లిస్తా, ఇప్పుడు చెల్లిస్తా అంటూ మోసం చేస్తు న్న తీరుపై సంజయ్ కలాసీపై గతంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఆ వ్యవహారం మరుగున పడిందన్నారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాలకు చెందిన తామంతా రూ.4.50 కోట్ల మేర నష్టపోయామని విలేకరులకు వివరించారు. సంజయ్ కలాసీని పోలీసులు అదుపులోకి తీసుకుని తమ సొమ్ములు తమకు ఇప్పించి ఆదుకోవాలని రైతులు దంగేటి నరసింహారావు, ఆకుల జోగయ్యనాయుడు, ఎన్.శ్రీనివాసరావు, ఫైదాడి నాగేశ్వరరావు, కొప్పాడి దుర్గారావు తదితరులు కోరుతున్నారు.



కలాసీని అరెస్టు చేసి ఆదుకోవాలని కోరుతున్న ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండలాల రైతులు

హరికథా కళాకారుడు మృతి

ఉప్పలగుప్తం, ఆగస్టు 30: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం గ్రామానికి చెందిన ప్రముఖ హరికథ కళాకారుడు చిక్కం కృష్ణమూర్తి భాగవతార్ (71) శుక్రవారం మృతి చెందారు. టీటీడీ ఆధ్వర్యంలో ఆయన పలు రాష్ట్రాల్లో హరికథా గానం చేశారు. దూరదర్శన్, ఆకాశవాణి కళాకారుడిగా ప్రఖ్యాతిగాంచారు. ఆయనకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు నాగబాబు కూడా హరికథా కళాకారుడే. కృష్ణమూర్తి భాగవతార్ మృతికి గ్రామస్తులతో పాటు ఎంపీపీ దంగేటి వీరఅచ్యుతజానకీరాంబాబు, సర్పంచ్ కడిమి చిన్నవరాజు, ఉప సర్పంచ్ మోకా శ్రీనివాసరావు తదితరులు సంతాపం తెలిపారు.



చిక్కం కృష్ణమూర్తి భాగవతార్ (పాత చిత్రం)

పెన్షన్ల పంపిణీలో

గ్రామ వలంటీర్ల చేతివాటం

రూ.14లక్షలు రికవరీకి ఆదేశాలు

రాజవొమ్మంగి, ఆగస్టు 30: మండలంలో గత ఆర్థిక సంవత్సరంలో పెన్షన్ల పంపిణీలో వలంటీర్లు చేతివాటం ప్రదర్శించారు. దాదాపు ప్రతి గ్రామంలోనూ చనిపోయిన వ్యక్తులు బతికి ఉన్నట్టు చూపి లక్షల రూపాయలను వారి జేబుల్లో వేసుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో చెల్లించిన పెన్షన్ సొమ్ములపై ఆడిట్ అధికారులు సామాజిక తనిఖీ చేపట్టారు. మండలంలో చనిపోయిన వారి పేరిట వలంటీర్లు తీసుకున్న సొమ్ము, నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అయినవి... మొత్తం రూ.14,17,500 రికవరీ చేయాల్సి ఉందని నివేదిక ఇచ్చారు. దీనిపై రాజవొమ్మంగి ఎంపీడీవో యాదగిరేశ్వరావు మాట్లాడుతూ... ఆడిట్ అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం చాలా గ్రామాల్లో చనిపోయిన వారి పేరుతో వలంటీర్లు పెన్షన్ సొమ్ము తీసుకున్నట్టు గుర్తించామన్నారు. అత్యధికంగా చికిలింత పంచాయతీలో రూ.3,08,500, జడ్డంగి పంచాయతీలో రూ.1,07,250 తీసుకున్నట్టు నివేదికలో ఉందని, సమగ్ర దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని చెప్పారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఇండియన్ కోస్ట్‌గార్డ్ అధికారి


బొక్కుసొర చేప పరిరక్షణతో

సముద్ర జలాల శుద్ధి

కాకినాడ సిటీ, ఆగస్టు 30: బొక్కుసొర చేప పరిరక్షణ ద్వారా సముద్ర జలాల శుద్ధి జరుగుతుందని, చేపల వేట సమయంలో అవి వలలకు చిక్కినా సముద్రంలోనే వదిలి వేయాలని అధికారులు సూచించారు. ప్రపంచ బొక్కుసొర చేప దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడలోని కుంభాభిషేకం రేవులో మత్స్యకారులు, బోట్ల యజమానులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అధ్యక్షత వహించిన వన్యప్రాణి విభాగం ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్ మాట్లాడుతూ అంతరించిపోతున్న బొక్కు సొర చేపను వేటాడడం నేరమని, దీని ప్రాముఖ్యతను మత్స్యకారులు గుర్తించాలని వివరించారు. మత్స్య శాఖ ఏడీ ఆర్.నూకరాజు, వి.అనురాధ, ఇండియన్ కోస్ట్‌గార్డ్ ఎస్ఈ బి.ధనుంజయ, మెరైన్ ఏఎస్ఐ బి.ఏలియా, ఫారెస్ట్ సెక్షన్ ఆధికారి ఎస్.వీరభద్రరావు, బోట్ల యూనియన్ అధ్యక్షుడు సంగాడి నాగేశ్వరరావు, మత్స్యకారులు, బోట్ల యజమానులు పాల్గొన్నారు.

వంద రోజుల ప్రణాళికపై ఆరా

హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ అధికారులతో వెబ్-ఎక్స్ మీటింగ్



కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 30: హౌసింగ్ మేనేజింగ్ డైరెక్టర్ పి.రాజబాబు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లాల హౌసింగ్ అధికారులతో శుక్రవారం వెబ్ ఎక్స్ మీటింగ్ నిర్వహించారు. హౌసింగ్ శాఖలో వంద రోజుల ప్రణాళిక పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది అక్టోబరు నాటికి 4,400 ఇళ్లను పూర్తి చేయడానికి వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను పూర్తి స్థాయిలో అమలు చేయాలని, నీటి సరఫరా, అప్రోచ్ రోడ్లు, అంతర్గత రోడ్లు, విద్యుదీకరణ మొదలైన కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఈఈలు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

వృద్ధురాలిపై అత్యాచారం

కరప మండలం వేళంగిలో ఘటన

కరప, ఆగస్టు 30: ఇంట్లో ఒంటరిగా ఉన్న 85ఏళ్ల వృద్ధురాలిపై ఒక వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటన గురువారం రాత్రి కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి గ్రామంలో జరిగింది. స్థానికులు, కరప పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వేళంగా కరణం గారి వీధిలో ఒక వృద్ధురాలు సోదరితో కలిసి నివాసముంటోంది. సోదరి ఊరు వెళ్లడంతో వృద్ధురాలు ఒంటరిగా ఉంది. గురువారం రాత్రి 11 గంటలు దాటిన తర్వాత అదే గ్రామానికి చెందిన నొక్కు వెంకటరమణ ఇంట్లోకి చొరబడి ఆమెపై అఘాయిత్యానికి పాల్పడినట్టు తెలుస్తోంది. శుక్రవారం ఉదయం శరీరంపై రక్తపు గాయాలతో మూలుగుతున్న బాధితురాలిని గమనించిన స్థానికులు కరప పోలీసులకు సమాచారం అందించారు. కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో పెదపూడి ఎస్ఐ కె.రామారావు నిందితుడు వెంకటరమణను అదుపులోకి తీసుకుని కరప పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బాధితురాలిని చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి జరిగిన ఘటనపై విచారణ చేపట్టారు. బాధితురాలిపై అత్యాచారం జరగలేదని, తాగిన మైకంలో నిందితుడు ఆమెపై కత్తితో దాడి చేసినట్టుగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిందితుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారని, అతడి భార్య ఉపాధి నిమిత్తం కువైట్‌లో ఉంటోందని స్థానికులు తెలిపారు. గతంలో రాయవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో నిందితుడిపై ఇదే తరహా కేసు నమోదైనట్టుగా తెలుస్తోద. వెంకటరమణ మందు తాగితే సైకోలా ప్రవర్తిస్తాడని గ్రామస్తులు చెప్తున్నారు. బాధితురాలి వద్ద నుంచి స్టేట్‌మెంట్ తీసుకుంటున్నామని, దాన్ని అనుసరించి నిందితుడిపై కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ ప్రసన్నకుమార్ తెలిపారు. కాగా ముదుసలిపై అఘాయిత్యానికి పాల్పడిన మానవ మృగంపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

చింతూరు మండలంలో

మరో శిశువు మృతి



చింతూరు ఆగస్టు 30: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో శుక్రవారం మరో శిశువు మృతి చెందింది. దీంతో ఒక్క ఆగస్టు నెలలోనే మృతి చెందిన చిన్నారుల సంఖ్య ఏడుకు చేరింది. చింతూరు మండలం బోరింగ్ గుంపు (కలిగొండ)కు చెందిన కుంజా జయమ్మ స్థానిక మినీ అంగన్‌వాడీ కేంద్రంలో కార్యకర్తగా పని చేస్తోంది. ఆమె 8 నెలల గర్భవతి. గురువారం రాత్రి పురిటినొప్పులు రావడంతో జయమ్మను ఆటోలో ఏడుగురాళ్లపల్లి ప్రాథమిక ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. అయితే వర్షం కారణంగా కలిగొండ, పేగ గ్రామాల మధ్య వాగు ఉధృతి పెరిగింది. దీంతో ప్రవాహం తగ్గేవారంతా వేచి చూశారు. శుక్రవారం ఉదయం తగ్గుముఖం పట్టడంతో గర్భిణిని వాగు దాటించారు. సమీపంలోని పేగ గ్రామానికి ఆటోలో చేరుకునే సరికి జయమ్మకు నొప్పులు మరింతగా పెరిగాయి. పేగలో ఒకరి ఇంటి వద్ద ఆమె ప్రసవించింది. అక్కడి నుంచి తిరిగి ఆటోలో ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు తల్లి, బిడ్డలను పరిక్షించి శిశువు ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని చెప్పారు. అనంతరం అంబులెన్సులో చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు శిశువును పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. దాంతో చేసేదేమీ లేక మృత శిశువును తల్లిదండ్రులు ఇంటికి తీసుకెళ్లి దహన సంస్కారాలు జరిపారు.



నిందితులను చూపిస్తున్న అటవీ శాఖ అధికారులు

గోనెసంచుల్లో గుట్టుగా... వాహనంలో తరలిస్తున్న

278 తాబేళ్ల పట్టివేత


మోతుగూడెం, ఆగస్టు 30: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో భారీ సంఖ్యల్లో తాబేళ్లను పట్టుకున్నారు. లక్కవరం అటవీ క్షేత్ర పరిధిలోని సుకుమామిడి నార్త్ బీట్‌లో ఫారెస్ట్ అధికారులు పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఏపీ20ఏడీ 3789 మహేంద్ర స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. అందులో 8 గోనె సంచులను గమనించి తెరవగా తాబేళ్లను గుర్తించారు. వాటిని లెక్కించగా మొత్తం 278 తాబేళ్ల వున్నాయి. వాటిలో 33 చనిపోగా 245 బతికి ఉన్నాయని అధికారులు తెలిపారు. అమలాపురం నుంచి ఒడిసా రాష్ట్రంలోని 79 గ్రామానికి తాబేళ్లను తరలిస్తున్నారు. పొల్లూరుకు చెందిన కార్తిక్ మండల్, కోరుకొండ మండలం జగన్నాథపురానికి చెందిన బలిన సాయికృష్ణలను అదుపులోకి తీసుకుని వారిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు. వాహనాన్ని, తాబేళ్లను సీజ్ చేసి అటవీ శాఖ కార్యాలయానికి తరలించారు. తాబేళ్లను సీలేరు నదిలో వదిలిపెట్టారు. కేసును చేధించిన వారిలో లక్కవరం రేంజర్ జీవీ నానాజీ, డీఆర్వో కె.సత్యనారాయణ, ఫారెస్ట్ బీట్ అధికారులు కె.రామదాసు వెంకట్, సుకుమామిడి నార్త్ బీట్ ఇన్‌చార్జి, తూలుగొండ బేస్ క్యాంప్ సిబ్బంది పాల్గొన్నారు.



కృష్ణవరం టోల్‌గేట్ వద్ద పట్టుకున్న గంజాయి

రూ.4.23 లక్షలు విలువైన 84 కిలోల

గంజాయి స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లతాకుమారి

కిర్లంపూడి, ఆగస్టు 30: కాకినాడ జిల్లా కిర్లంపూడిలో రూ.4.23లక్షలు విలువైన 84.66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని అరెస్టు చేసినట్టు పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి తెలిపారు. కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఆమె వెల్లడించారు. కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు కిర్లంపూడి మండలం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద గురువారం ఎస్ఐ సతీష్ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపట్టారు. విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న కేఏ01 ఏఎం 3279 ట్యాంకరును ఆపి పరిశీలించారు. క్యాబిన్ అరలో, క్లీనర్ సీటు కింది భాగంలో మొత్తం 43 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆయిల్ ట్యాంకరుతో పాటు ఒక సెల్ ఫోన్, రూ.వెయ్యి నగదు సీజ్ చేశారు. డ్రైవర్ అన్సారీ, పాంగీ సన్యాసిరావు అలియాస్ సంతోష్, కైసర్ల దివాకర్‌లను అరెస్టు చేయగా రాజేష్ టీకే, ధనశేఖరన్ బాలచంద్ర పరారీలో ఉన్నారు. అరెస్టు చేసిన ముగ్గురినీ ప్రత్తిపాడు కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ చెప్పారు. గంజాయి విలువ రూ.4,23,300, ఆయిల్ ట్యాంకరు విలువ రూ.7లక్షలు అన్నారు. విలేకరుల సమావేశంలో జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏజెన్సీ సమాచారం



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

పర్యావరణ సంరక్షణకు మొక్కలు నాటాలి

ఐటీడీఏ పీవో సింహాచలం

రంపచోడవరం, ఆగస్టు 30: పర్యావరణ సంరక్షణకు ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక గిరిజన గురుకుల సంక్షేమ బాలుర పాఠశాలలో మొక్కలను నాటారు. పీవో మాట్లాడుతూ ప్రతి గ్రామం, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు నాటాలని సూచించారు. సబ్ డీఎఫ్‌వో కె.శ్రీవాణి, అటవీ రేంజ్ అధికారి ఉషారాణి, సర్పంచ్ మంగా బొజ్జయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ ఎలీషా, సెక్షన్ అధికారి ఎస్.కృష్ణ, బీట్ అధికారి విజయదుర్గ పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్యే శిరీషదేవి

రంపచోడవరం, ఆగస్టు30: రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలశాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌ని శుక్రవారం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు సమస్యలు మంత్రికి వివరించారు. తెలుగు యువత అధ్యక్షుడు మఠం విజయభాస్కర్ మంత్రిని కలిసిన వారిలో ఉన్నారు.

ఐటీడీఏ పీవోగా అపూర్వభరత్



చింతూరు,ఆగస్టు30: చింతూరు ఐటీడీఏ పీవో, ఎటపాక సబ్‌కలెక్టర్‌గా అపూర్వ భరత్ నియమితులైన విషయం తెలిసిందే. శుక్రవారం ఆయన బాధ్యతలను స్వీకరించారు. అపూర్వభరత్ ఇప్పటివరకు శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వరిస్తూ ఇక్కడకు వచ్చారు.

ఇద్దరు ఉద్యోగులు సస్పెన్షన్

మారేడుమిల్లి, ఆగస్టు 30: మండలంలోని బోదులూరు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలతో వెట్టిచాకిరి చేయించుకుంటున్న ఏఎన్ఎం కొమరం రామలక్ష్మి, వార్డెన్ బి.మంగాయమ్మను సస్పెండ్ చేసినట్టు గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టరు సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశాల మేరకు వీరిని సస్పెండ్ చేసినట్టు తెలిపారు.



లక్కవరంలో మొక్కలు నాటుతున్న ఎస్ఐ, ఫారెస్ట్ అధికారులు

లక్కవరం ఏకలవ్య పాఠశాలలో వన మహోత్సవం

మోతుగూడెం/ఆగస్టు30: వనమహోత్సవంలో భాగంగా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న చదలవాడ పంచాయతీ లక్కవరం ఏకలవ్య పాఠశాలలో వనమహోత్సవం ఫారెస్ట్ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా మోతుగూడెం ఎస్ఐ జీగోపాలరావు, ఎస్ఎంసీ ఛైర్మన్ నరేష్, లక్కవరం రేంజర్ జీవీ నానాజీ, పాఠశాల ప్రిన్సిపాల్ దిలీప్‌సింగ్ పాల్గొని పాఠశాలలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన, డిబేట్ నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ వి జయ్‌కుమార్, అరుణ, బీట్ ఆఫీసర్స్ సరిత, సునీత, బసవయ్య, గీత, వెంకట్, వైస్ ప్రిన్సిపాల్ బాలశ్రీదేవి, పీఈటీ అంకిత్‌కుమార్ పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో...

రాజవొమ్మంగి మండలంలో శుక్రవారం జరిగిన వనమహోత్సవంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పలుచోట్ల మొక్కలు నాటారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోలీసు స్టేషన్, బాలుర ఆశ్రమ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచ్ గొల్లపూడి రమణి, ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, జనసేన మండల శాఖ అధ్యక్షుడు బొడిరెడ్డి త్రిమూర్తులు, ఎంపీడీవో యాదగిరేశ్వరావు, డిప్యూటీ తహశీల్దార్ అల్లు సత్యనారాయణ, సీఐ సన్యాసినాయుడు, అటవీశాఖ రేంజ్ అధికారి అబ్బాయిదొర, సొసైటీ మాజీ అధ్యక్షుడు గణజాల తాతారావు పాల్గొన్నారు.

ఇందుకూరుపేటలో...

దేవీపట్నం, ఆగస్టు 30: మండలంలోని ఇందుకూరుపేట జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేసి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శిరసం కృష్ణవేణి, ఎంపీపీ కుంజం మురళి, టీడీపీ నాయకులు మర్రిశెట్ల వెంకటేశ్వరరావు, ఎం.బాబురావు, జనసేన సి.వెంకటరాయుడు, విద్యాకమిటీ ఛైర్మన్‌లు ఎస్.వీరభద్ర రామకృష్ణ, జి.అరవింద్, హెచ్ఎం ముత్యాలరావు, కారం పోశమ్మ, కట్టుమూరి వీరబాబు, డి.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలని వినతి

మోతుగూడెం,ఆగస్టు30: సీలేరు కాంప్లెక్స్ పరిధిలో గల డొంకరాయి పవర్ కెనాల్ సబ్ డివిజన్‌లో ఒప్పంద కార్మికుడుగా పనిచేసే మావూరి వీర వెంకట సత్యనారాయణ టీడీపీ సానుభూతిపరుడని, అప్పటి వైసీపీ నాయకులు కక్ష కట్టి అధికారులను బెదిరించి విధులకు దూరంచేశారని విద్యుత్‌సౌధ అధికారులకు ఎమ్మెల్యే మిరియాల శిరీష తెలిపారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఎంపీటీసీ కరకా వెంకటరమణ మంగళగిరి ప్రజావాణి కార్యక్రమంలో మంత్రి టీజీ భరత్‌ను కలిసి ఈ వ్యవహారం వివరించి అర్జీ అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందించి చర్యలు నిమిత్తం జెన్‌కో అధికారులకు అర్జీని పంపించారు. ఇప్పటికైనా బాధితుడికి న్యాయం చేయాలని ఎంపీటీసీ కోరారు.

బొర్నగూడెంలో ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమం

రంపచోడవరం, ఆగస్టు 30: మండలంలోని బొర్నగూడెం గ్రామంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రాంబాబు అధ్యక్షతన ప్రధానమంత్రి జన్‌మన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యుడు వంశీ కుంజం మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పీవీటీజీల గ్రామాభివృద్ధికి 23 రకాలు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రభారెడ్డి, వార్డు మెంబర్ రామలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుసుమకుమారి, బొబ్బా శేఖర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీఎఫ్ యూనిఫాంలో మార్పు

రాజమహేంద్రవరం, ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం (ఏపీఎస్పీఎఫ్)లోని కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్ స్థాయి సిబ్బందికి యూనిఫాం మారింది. కొత్త యూనిఫాంని శుక్రవారం జోన్ కమాండెంట్ డాక్టర్ కె.నరసింహరావు ఆవిష్కరించి సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు పీవీఎస్ఏడీ ప్రసాదరావు, ఒ.కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



డీఎల్ఎస్ఏ సభ్యునిగా గొట్టిముక్కల

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30: డిస్ట్రిక్ లీగల్ సర్వీసు అథారిటీ (డీఎల్ఎస్ఏ) సభ్యునిగా గొట్టిముక్కల అనంతరావు నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి సంప్రదింపులతో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెం.805 ద్వారా నియామక ఉత్తర్వులు జారీచేశారు. రెండు సంవత్సరాల పాటు ఈ పదవిలో ఆయన కొనసాగుతారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా అనంతరావును పలువురు న్యాయవాదులు, అధికారులు అభినందించారు.

'మెగా డెంటల్ మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోండి'

అనపర్తి, ఆగస్టు 30: జీఎస్ఎల్ ఆసుపత్రి, మూలారెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సెప్టెంబరు 1 నుంచి 3వ తేదీ వరకు అనపర్తి మండలం పొలమూరులోని శ్రీదేవి కల్యాణ మండపంలో నిర్వహించే మెగా మెడికల్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎండీ డాక్టర్ గన్ని సందీప్ పిలుపునిచ్చారు. శుక్రవారం అనపర్తిలోని శ్రీరామారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల దంత పరీక్షల శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాల ఎండీ డాక్టర్ సందీప్ మెగా వైద్య శిబిరం బ్రోచర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం పులగం వెంకటరెడ్డి, పాఠశాల కమిటీ ఛైర్మన్ ఎమ్ పార్వతి, వైస్ ఛైర్మన్ రాజేశ్వరి, ఎన్డీఏ నాయకులు కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, సత్తి దేవదానరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవార పూజలు



రాజానగరంలో రావుల చెరువు గట్టున అమ్మవారు

రాజమహేంద్రవరం కల్చరల్/గోకవరం/రాజానగరం, ఆగస్టు30: శ్రావణమాసం చివరి శుక్రవారం కావడంతో రాజమహేంద్రవరంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లకు పూజలు, వ్రతాలు జరిపించారు. స్థానిక శ్రీవెంకటేశ్వర జనరల్ మార్కెట్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. దేవీచౌక్ శ్రీ బాలత్రిపురసుందరి అమ్మవారు, వంకాయలవారి వీధిలోని శ్రీఅష్టలక్ష్మి అమ్మవారు, రంగ్రీజుపేటలో ఆదిలక్ష్మి అమ్మవార్లను దర్శించుకొని భక్తులు పూజలు, వ్రతాలు చేసుకున్నారు. గోకవరం మండలం తంటికొండ గ్రామంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి సన్నిధిలో శుక్రవారం ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. దేవస్థానం మాజీ ఛైర్మన్ బదిరెడ్డి అచ్చన్నదొర, సువర్ణతులసి దంపతులతో వరలక్ష్మీవ్రత పూజ ప్రారంభించగా సుమారు 500మంది మహిళలు వ్రతంలో పాల్గొని పూజలు చేశారు. అలాగే రాజానగరం మండలంలోని రాజానగరంలోని రావులచెరువు గట్టుపై రామాలయంలో కొలువుతీరిన మహాలక్ష్మి అమ్మవారికి ఆలయ పురోహితులు సాయి ఆధ్వర్యంలో సహస్ర నామ సామూహిక కుంకుమ పూజలు, లలితా సహస్రనామ పారాయణం చేపట్టారు. అలాగే ముక్కినాడలోని శ్రీసాయిబాబా మందిర ప్రాంగణంలో చేపట్టిన సామూహిక కుంకుమ పూజా క్రతువులో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

రెండు అంగన్‌వాడీ సెంటర్లకు సొంత భవనాలు : ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30: రాజమహేంద్రవరం 47వ డివిజన్‌లో రెండు అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాల్లోకి మార్పుచేశారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ మంచి పౌష్టికాహారం పిల్లలకు అందించి బాగా చూసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ఇంచార్జి బేసరి చిన్ని, మాజీ కార్పొరేటర్ రేలంగి శ్రీదేవి, టీడీపీ నాయకులు కవులూరి వెంకట్రావు, మోతా నాగలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మహిళల ఆత్మరక్షణకు మార్షల్ ఆర్ట్స్ : ఎమ్మెల్యే

ప్రస్తుత సమాజంలో మహిళల ఆత్మరక్షణ కోసం మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం చాలా అవసరమని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఫారెస్ట్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ హాలులో రెండు రోజులపాటు జరిగే 9వ ఇంటర్ డిస్ట్రిక్ట్ ఉషు సీనియర్ అండ్ సబ్ జూనియర్ చాంపియన్ షిప్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ఆదిశేషు, కార్యనిర్వాహకులు బి.నరసింహరావు, టీడీపీ నాయకులు అజ్జరపు రమేష్, మరుకుర్తి రవియాదవ్, హరి బెనర్జీ, జిల్లా ఉషు అసోసియేషన్ అధ్యక్షుడు అజ్జరపు వాసు, కార్యదర్శి అనిల్ సుందరం, పొన్నాడ బాబి, వివిధ జిల్లాల క్రీడాకారులు పాల్గొన్నారు.

మాధురి సంతోషికి డాక్టరేట్ అవార్డు నోటిఫికేషన్

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 : రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో రిసెర్చ్ స్కాలర్ పి.మాధురి సంతోషి డాక్టరేట్ అవార్డు నోటిఫికేషన్ అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన ఓ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే ఆమెను అభినందించారు. కాగా తమ కళాశాలకు చెందిన 9 మంది ఆక్వాకల్చర్ విద్యార్థులు రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ అక్వాకల్చర్, కంకిపాడులో తిలాపియా చేపల పెంపకంపై శిక్షణ పొందారని ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు.





పిడింగొయ్యి పంచాయతీలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే గోరంట్ల.. నన్నయ వర్సిటీలో ఇన్‌ఛార్జి ఉపకులపతి శ్రీనివాసరావు

మొక్కలను పెంచుదాం.... ఆరోగ్యాన్ని కాపాడుదాం : ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్/ కడియం, ఆగస్టు30: మొక్కలను పెంచడం ద్వారా ఆరోగ్యంతోపాటు ఆహ్లాదకర వాతావరణం ఉంటుందని రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తెలిపారు. పిడింగొయ్యి పంచాయతీ పరిధిలో వన మహోత్సవ కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ మొక్కలు పెంచడం ద్వారా ఆరోగ్యకర వాతావరణం ఉంటుందన్నారు. గత ప్రభుత్వం అన్ని రంగాలను నిర్వీర్యం చేసిందని, మహావృక్షాలను నేలకూల్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వన మహోత్సవంలో అందరూ పాల్గొని మొక్కలు నాటి వాటిని పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో మత్యేటి ప్రసాద్, మార్ని వాసుదేవరావు, మట్టా శ్రీను, బొప్పన నానాజీ, పందూరి అప్పారావు, ప్రత్యేకాధికారి జ్యోతి, ఎంపీడీ వో శ్రీనివాసరావు, కార్యదర్శి రూప్‌చంద్ పాల్గొన్నారు. కాగా కడియం ఉన్నత పాఠశాలలోనూ మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. ఇందులో ఎంపీపీ వెలుగుబంటి వెంకటసత్యప్రసాద్, సర్పంచ్ మోసిగంటి సత్యవతి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు ముద్రగడ జమీ, వెలుగుబంటి

ఘనంగా వన మహోత్సవం

నాని, కడియపులంక సర్పంచ్-ఇన్‌చార్జి పాటంశెట్టి రాంజీ పాల్గొన్నారు.

నన్నయ ప్రాంగణాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దాలి : ఇన్‌చార్జి వీసీ

దివాన్‌చెరువు, ఆగస్టు 30: విద్యార్థులంతా మొక్కలు నాటి వాటిని పర్యవేక్షిస్తూ నన్నయ విశ్వవిద్యాలయం ప్రాంగణాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి వై.శ్రీనివాసరావు అన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వన మహోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు పరిపాలన భవనం ఆవరణలో మొక్కలు నాటారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాళ్లు ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, ఇంజనీర్ కె.నూకరత్నం, ఎన్ఎస్ఎస్ పీవోలు ఎం.గోపాలకృష్ణ, ఎల్.ముత్యాలనాయుడు, ఎన్.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్యే నల్లమిల్లి

అనపర్తి ఆగస్టు 30: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం బాధ్యతగా తీసుకోవాలని, వాటి సంరక్షణ బాధ్యతను కూడా చేపట్టాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం వన మహోత్సవం సందర్భంగా అనపర్తిలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కను నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంపీడీవో హిమమహేశ్వరి, హెచ్ఎం వెంకటరెడ్డి, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీ సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణపరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

రాజానగరం, ఆగస్టు30: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాసేన కోసం నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పేర్కొన్నారు. రాజానగరంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో శుక్రవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు.

డెంగ్యూ మలేరియా వ్యాధులు ప్రబలకుండా చర్యలు : డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం రూరల్, ఆగస్టు30: డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు ఆదేశించారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఆయన రూరల్ మండలం బొమ్మూరులో కొన్ని ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్లో ప్రజలు వ్యాధులకు గురికాకుండా ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని, వేడిగా ఉన్న ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. అనంతరం డ్రైనేజీల వద్ద ఇళ్ల పరిసరాల్లో దోమల లార్వా నియంత్రణకు మందు పిచికారి చేయించారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా సిబ్బంది, ధవళేశ్వరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

మురమండలో ఫీవర్ సర్వైలెన్స్

కడియం, ఆగస్టు 30: జిల్లా వైద్యశాఖ అధికారి ఆదేశాల మేరకు ప్రతీ గ్రామంలో ఫీవర్ సర్వైలెన్స్ నిర్వహించి వైద్యసేవలు అందిస్తున్నట్టు కడియపులంక పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ స్వరూప తెలిపారు. కడియం మండలం మురమండలో శుక్రవారం ఏఎన్ఎంలు, ఎంపీహెచ్ఎస్‌లు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు ప్రతీ ఇంటా ఫీవర్ సర్వైలెన్స్ నిర్వహించారు. వైరల్ జ్వరాలు ఎక్కువగా ఉన్నందున వైద్యసేవలు అందించి మందుల పంపిణీతోపాటు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

జీజీయూలో ముగిసిన వర్క్‌షాప్

రాజానగరం, ఆగస్టు 30: అఖిలభారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) వాణి పథకంలో భాగంగా గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయంలోని పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో గత రెండ్రోజులుగా జరిగిన వర్క్‌షాప్ శుక్రవారంతో ఘనంగా ముగిసింది. 'విద్యుత్ వాహనాల వేస్ట్ బ్యాటరీ నుంచి పర్యావరణంపై పడుతున్న ఇటీవల పరిణామాలు' అంశంపై నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో విజయవాడలోని ఫిక్కీ ఎనర్జీ మేనేజర్ మెహర్‌అలీ అహ్మద్ పాల్గొని మాట్లాడుతూ బ్యాటరీల వల్ల పర్యావరణానికి జరిగే నష్టాన్ని వివరించారు. ఎనర్జీ సెక్టార్లో విద్యార్థులకు లభించే ఉద్యోగావకాశాలను తెలియజేశారు. అలాగే ధన్బాద్‌లోని ఐఐటీ, ఐఎస్ఎం నుంచి నెల్లూరులోని వీఐటీ నుంచి వచ్చిన ప్రముఖులు హాజరై పలు అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో అటానమస్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జయానందకుమార్, పెట్రోలియం ఇంజనీరింగ్ విభాగాధిపతి ఎం.డి మహ్మద్ షరీఫ్, కోఆర్డినేటర్ నాగలక్ష్మి, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలకృష్ణ

వాయిద్య కళాకారుల వాహనాలకు ఆటంకాలు కల్పించవద్దు : గోపాలకృష్ణ

బిక్కవోలు, ఆగస్టు30: కళాకారులు శుభ, దైవ కార్యక్రమాలకు వాయిద్య పరికరాలను వ్యాన్‌లకు ట్రాలీలు తగిలించుకుని తీసుకువెళ్లడానికి గతంలో ఉత్తర్వులు ఉన్నాయని, గత ప్రభుత్వ హయాంలో పోలీసు, రవాణా శాఖలు జరిమానాలు విధించాయని ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ ఆరోపించారు. బిక్కవోలు కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నాయీ బ్రాహ్మణ వాయిద్య కళాకారుల సమావేశం జిల్లా అధ్యక్షులు ర్యాలి చిన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గోపాలకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం స్పందించి ఎటువంటి చలనాలు రాయకుండా పోలీస్, రవాణా శాఖలకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు.

3న విశాఖలో భారీ బహిరంగ సభ విజయవంతం చేయండి

- సీపీఐ జిల్లా కార్యదర్శి మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30: విశాఖ ఉక్కు కార్మికులకు సంఘీభావం తెలిపేందుకు సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలు జరగనున్నాయని, ఆఖరిరోజున నిర్వహించే భారీ ప్రదర్శన, బహిరంగ సభను కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరం మెరకవీధిలోని జట్ల లేబర్ యూనియన్ కార్యాలయంలో మేస్త్రీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కార్మికులకు సంఘీభావం ప్రకటించడానికి ఉక్కు నగరంలో జాతీయ సమ్మేళనాలు జరుగుతున్నాయన్నారు. చివరి రోజున సరస్వతి పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకూ భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతుందన్నారు. అలాగే అధిక ధరలపై 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ జిల్లావ్యాప్తంగా ప్రచార ఆందోళనలను నిర్వహిస్తున్నామని, 6న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు ఘటనలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలి : జక్కంపూడి రాజా

రాజానగరం, ఆగస్టు 30 : కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో రహస్య కెమెరాల ఘటనపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రయువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వాష్ రూంలో రహస్య కెమెరాలు అమర్చి విద్యార్థినుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న వారిపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

కెమెరాలు పెట్టిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి : పీడీఎస్‌యూ

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులోని ఇంజనీరింగ్ కళాశాల బాలికల హాస్టల్‌లోని వాష్‌రూమ్స్‌లో హిడెన్ కెమెరాలు పెట్టిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ వారం కిందటే ఈ విషయం వెలుగులోకి వచ్చినా ఇంజనీరింగ్ కళాశాల హాస్టల్ యాజమాన్యం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఈ వ్యవహారంలో కేవలం సీనియర్ విద్యార్థినిల ప్రమేయం ఉందా లేక యాజమాన్యం, అక్కడ పనిచేసే వ్యక్తుల ప్రమేయం ఉందా అనేదానిపై సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు. విద్యార్థినిలకు భద్రత పెంచాలని కోరారు.

దుళ్ల పంచాయతీ వార్డు మెంబర్ల నిరసన

కడియం, ఆగస్టు 30: ప్రజల మద్దతుతో ఎంపీటీసీ, వార్డు సభ్యులుగా గెలిచిన తమకు గుర్తింపులేదని దుళ్ల గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఆవేదన వెలిబుచ్చారు. కడియం మండలం దుళ్ల గ్రామ కార్యదర్శిగా కొత్తగా బాధ్యతలు తీసుకున్న వీడీవీ లక్ష్మి శుక్రవారం పంచాయతీ సాధారణ సమావేశం ఏర్పాటుచేశారు. సంతకాలు చేయండి అంటూ చెప్పడంతో వార్డు సభ్యులు మండిపడ్డారు. తమకు ఏ ప్రాధాన్యతలేని పాలన ఈనాటి వరకు సాగిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్యదర్శి మాట్లాడుతూ 90 రోజుల్లో సమావేశంలో ఏర్పాటుచేయాల్సి ఉందని, లేదంటే బోర్డు రద్దయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. చివరకు కార్యదర్శి సమావేశాన్ని వాయిదా వేయడంతో సమస్య సద్దుమణిగింది.

బిక్కవోలు విలేకర్లపై పెట్టిన కేసు కొట్టివేత

బిక్కవోలు, ఆగస్టు30: బిక్కవోలులో గత ఏడాది 12 మంది విలేకర్లపై పెట్టిన కేసును అక్రమ కేసుగా పరిగణించి ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు కొట్టివేసిందని బిక్కవోలు మీడియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం వీవీఎస్ఎన్ రెడ్డి తెలిపారు. కేసు విషయంలో సహకరించిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని శుక్రవారం విలేకర్లు సత్కరించారు. కేసు వాదించిన లాయర్ సలాది నారాయణమూర్తికి కృతజ్ఞతలు తెలిపారు.

రోజంతా వాన..



ఆగని వాన : వానలో తడుస్తూ వెళుతున్న ప్రయాణికులు

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30 : ఒక్కటే వాన... ఎక్కడా తెరిపివ్వలేదు.. శుక్రవారం రాత్రి 1 గంట నుంచి చినుకులు పడుతూనే ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 17 మండలాల్లో గడచిన 24 గంటలుగా అల్పపీడన ద్రోణి ప్రభావంతో ఎడతెరిపిలేని వాన కురుస్తూనే ఉంది. జిల్లాలో 67.6 శాతం వర్షం కురిసింది. అత్యధికంగా రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలో గోకవరం మండలంలో 11.4 మి.మీ వర్షం కురవగా అత్యల్పంగా సీతానగరం మండలంలో 1.0 మి.మీ వర్షం కురిసిందని వాతావరణ శాఖ తెలిపింది. అనపర్తిలో 7.2 మి.మీ, కడియం 5.0 మి.మీ, బిక్కవోలు 3.4 మి.మీ, రాజానగరం 3.4 మి.మీ, రాజమహేంద్రవరం రూరల్ 3.2 మి.మీ, రంగంపేట 2.6 మి.మీ, రాజమహేంద్రవరం 2.4 మి.మీ వర్షపాతం నమోదైంది. కొవ్వూరు డివిజన్‌లో ఉండ్రాజవరం 5.2 మి.మీ, పెరవలి 5.0 మి.మీ, తాళ్ళపూడి 3.8 మి.మీ, గోపాలపురం 3.4 మి.మీ, చాగల్లు 3.2 మి.మీ, కొవ్వూరు 3.2 మి.మీ, దేవరపల్లిలో 2.6 మి.మీ, నిడదవోలు లో 1.6 మి.మీ వర్షపాతం నమోదైంది. శుక్రవారం రాత్రి వర్షం చెదురుమొదురు జల్లులుగా కురిసింది.

వనోత్సాహం..
ఊరూ వాడా వనమహోత్సవం



మొక్కను నాటి నీళ్లు పోస్తున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో కలెక్టర్ ప్రశాంతి, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 : మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని, ప్రధానంగా విద్యార్థి దశ నుంచే పిల్లల్లో ఇది అలవాటుగా మారాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల లక్ష్మీ దుర్గేష్ అన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లు ఈ వనమహోత్సవం కార్యక్రమాన్ని ఒక పండుగలా రాష్ట్రమంతటా నిర్వహించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. దీనిలో భాగంగా రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్స్‌లో శుక్రవారం అటవీశాఖ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్క నాటారు. రాజమహేంద్రవరం సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ ప్రశాంతి పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో దుర్గేష్ మాట్లాడుతూ మానవాళి మనుగడకు ఆక్సిజన్‌ను అందించడంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదం చేసే మొక్కలను పెంచాలన్నారు. పెరిగిన చెట్లను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలు కళాశాలల్లో ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థి దశ నుంచే మొక్కల సంరక్షణ, బాధ్యత వారికి తెలియజేయవచ్చని ఈ దిశగా కలెక్టర్ చర్యలు తీసుకోవాలన్నారు. సెప్టెంబరు 2న పవన్ కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని సమాజహిత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు వనమహోత్సవాన్ని ఒక్క రోజుతోనే పరిమితం చేయకుండా దాదాపు 60 రోజుల పాటు జరిగేలా కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. స్కూళ్లు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, రోడ్లు, ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ మొక్కలు నాటడమే కాదు.. వాటిని సంరక్షించుకోవాలన్నారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే,జిల్లా ఫారెస్ట్ అధికారి బి.నాగరాజు, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి, ఆర్డీవో కేఎల్ శివజ్యోతి, ఆర్ట్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నన్నయ ప్రాంగణాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దాలి..
ఇన్‌చార్జి ఉపకులపతి శ్రీనివాసరావు

8



కార్పొరేషన్ గలీజు!
రాజమహేంద్రవరంలో మాయాజాలం

- 24 ఏళ్లుగా షాపుల వేలం హుష్‌కాకి
- రెన్యువల్‌కే అధికారుల ప్రాధాన్యం
- అసలు కంటే కొసరు ఎక్కువ
- 60 శాతం సబ్ లీజుదారులే
- ముగిసిన 104 షాపుల గడువు
- ఏడాదైనా నేటికీ కానరాని వేలం
- గత వైసీపీ ప్రభుత్వ నిర్వాకం
- పెట్టి షాపుల అద్దె రూ.420
- కార్పొరేషన్ ఆదాయానికి గండి

రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30 : వాణిజ్య రాజధాని రాజమహేంద్రవరం..ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు ఇదే పెద్ద మార్కెట్.. బంగారం నుంచి బట్టల వరకూ ఏది కొనాలన్నా పెద్ద ఎత్తున రాజమహేంద్రవరం తరలివస్తారు. దీంతో ప్రతి రోజూ కోట్లలో వ్యాపారం సాగుతోంది.. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నగరంలో షాపు అద్దెలు పేలిపోతాయి అనుకుంటున్నారా..? ప్రైవేటులో అయితే మీరన్నది నిజమే.. నగరపాలక సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్స్‌లు మాయా ప్రపంచంలో కొట్టుమిట్టాడుతున్నాయి. సుమారు 24 ఏళ్ల కిందట లీజుకు తీసుకున్నవారు సబ్ లీజులకు ఇచ్చి అదనపు ఆదాయాన్ని పొందుతున్నారు. కార్పొరేషన్ ఆదాయానికి భారీగా గండికొడుతున్నారు. షాపుల వేలం పాట మొదలుకొని కేటాయింపుల వరకు అన్నింటిలోను దళారీ వ్యవస్థ పాతుకుపోయింది. కార్పొరేషన్ షాపులు కొంత మంది అధికారులు, దళారులకు ఆదాయాన్ని తెచ్చిపెడుతున్నాయి.ఇదంతా ఒక మాయాప్రపంచంగా మారిపోయింది. దీంతో అర్హులకు అవకాశం లేకుండా పోతోంది. ఇది గత కొన్నేళ్లుగా యథేచ్ఛగా సాగుతున్నా ఏ అధికారి ఆ షాపుల లీజు వ్యవహారంపై పట్టించుకున్న దాఖలాలే లేవు.

ఆ 104 షాపుల సంగతేంటో..

రాజమహేంద్రవరంలో కార్పొరేషన్‌కు 251 షాపులు ఉన్నాయి. ఒక్కో షాపునకు తక్కువలో తక్కువ రూ.10 వేలు వేసుకున్నా రూ.25 లక్షల వరకూ ఆదాయం రావాలి. ఆ లెక్కన ఏడాదికి రూ.3 కోట్ల వరకూ ఆదాయం వస్తుంది. సుమారు 25 ఏళ్ళ కిందట అంటే 1999-2000లో 50 శాతం షాపుల ను లీజుకు ఇచ్చారు. ప్రతి ఐదేళ్లకోసారి షాపులకు వేలం నిర్వహించాల్సి ఉంటుంది. అయితే గత 24 ఏళ్లుగా వేలం అనేది లేకుండా షాపులను రెన్యువల్ చేసుకుంటూ పోతుండడంతో అద్దెలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. 251 షాపుల్లో 104 షాపులకు లీజు గడువు ముగిసి అర్ధసంవత్సరం దాటింది. ఈ షాపులను వేలంపాట ద్వారా మళ్లీ లీజుకు ఇవ్వాల్సి ఉన్నా ఆ ప్రయత్నాలే కానరావడంలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా షాపుల వేలం పాట అంశం తెరపైకి రావడం లేదు. 104 షాపులు లీజు గడువును దాటి కొనసాగుతున్నాయి. దీని వల్ల కార్పొరేషన్ ఆదాయం పెరగడం కన్నా పాత లీజుల పద్ధతే కొనసాగి నష్టం వాటిల్లుతోంది. ఇందతా అధికారులకు తెలిసినా చర్యలు మాత్రం కానరావడంలేదు.

షాపుల్లో సగం సబ్ లీజుదారులే

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ షాపింగ్ కాంప్లెక్స్‌లు అంటే కొందరికి పెట్టుబడిలేని వ్యాపారంగా మారింది. నగరపాలక సంస్థలో లీజులు దక్కించుకున్న వారిలో 60 శాతం మంది ఆయా షాపుల్లో వ్యాపారాలు చేయరు. వాటిని సబ్‌లీజులకు ఇచ్చి నెలనెలా ఆదాయం పొందుతున్నారు. వాస్తవానికి అన్ని అర్హతలు ఉండి కూడా వ్యాపారాలు చేసేందుకు నేరుగా అవకాశాలు లేక కొంత మంది దళారీల చేతిలో పడి సబ్ లీజులకు షాపులను తీసుకునే పరిస్థితి ఉంది. నగరంలో షాపుల అద్దె విషయానికి వస్తే పెట్టి షాపు రూ.420 మొదలు కొని మంచి సెంటర్‌లో ఉన్న ఒక్కో షాపునకు అత్యధికంగా రూ.35,271 వరకు నెలవారి అద్దె రూపంలో నగరపాలక సంస్థకు ఆదాయం వస్తుంది. ఈ అద్దెలు ప్రైవేటు షాపులతో పోల్చుకుంటే చాలా తక్కువ.

నాడు వేలం అడ్డుకున్న వైసీపీ..

రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు వచ్చే ప్రధాన ఆదాయాల్లో షాపుల వేలంపాట ఒకటి. ఈ వేలం పాటు ద్వారా నగరపాలక సంస్థకు ఆదాయం పెరుగుతుంది. ఆస్తులు, ఖాళీ స్థలాలు, భూముల ద్వారా ప్రతి ఏటా నగరపాలక సంస్థకు కోట్లాది రూపాయల ఆదాయం వస్తుంది. కాని గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం అనుసరించిన తీరు నగరపాలక సంస్థకు నష్టాలను తెచ్చిపెట్టింది. మాజీ ఎంపీ భరత్ రామ్ ఎన్నికల ముందు నగరంలో కార్పొరేషన్ షాపుల వేలం జరగనివ్వకుండా అధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో అధికారులు రూల్స్‌ను బ్రేక్ చేస్తూ షాపుల వేలం నోటిఫికేషన్ ఇవ్వకుండా సైలెంట్ అయ్యారు. పోనీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాతైనా వీళ్లు కదలడంలేదు. ఇప్పటికైనా కూటమి నాయకులు కళ్లు తెరవాలి. దళారులుగా మారిన వారి బారి నుంచి మునిసిపల్ షాపులను రక్షించాలి.అర్హులకు వేలంపాట ద్వారా షాపులు కేటాయిస్తే దళారి వ్యవస్థ పూర్తిగా కనుమరుగవుతుందని నగర పౌరులు అంటున్నారు.



నగరంలో 251 షాపులు

నగరంలో కార్పొరేషన్‌కు 251 షాపులు ఉన్నాయి. గోకవరం బస్టాండ్‌లో 19 షాపులు ఉండగా ఎస్సీలకు 3, ఎస్టీలకు 1 దివ్యాంగుల కోటాలో 1, ఇతరులకు 14 షాపులు లీజుకు ఇచ్చారు. లేపాక్షి షోరూం వద్ద 20 షాపులు ఉండగా ఎస్సీలకు 4, ఎస్టీలకు 1, దివ్యాంగులకు 1, ఇతరులకు 16 ఇచ్చారు. శివ జ్యోతి థియేటర్ వద్ద 15 షాపులు ఉండగా ఎస్సీలకు 2, ఎస్టీలకు 1, దివ్యాంగులకు 1 మిగిలిన 11 ఇతరులకు ఇచ్చారు. టౌన్ హాలు ఎదురుగా కార్పొరేషన్ షాపులు 8 ఉండగా వాటిలో ఎస్సీలకు 1, ఎస్టీలకు 1, దివ్యాంగులకు 1, మిగిలిన 5 షాపులు ఇతరులకు కేటాయించారు. కోటిపల్లి బస్టాండ్ కొవ్వూరు రోడ్డులో 16 షాపులు ఉండగా ఎస్సీలకు 1 ,మిగిలినవి ఇతరులకు కేటాయించారు. జాంపేట బజార్‌లో 25 షాపులు ఉండగా ఎస్సీలకు 4, ఎస్టీలకు 2, దివ్యాంగులకు 1, ఇతరులకు 18 షాపులు కేటాయించారు. ఎంఏ మార్కెట్‌లో 24 షాపులు ఉండగా ఎస్సీలకు 2, దివ్యాంగులకు 2, ఇతరులకు 22 షాపులు కేటాయించారు. జాంపేట గాంధీ బొమ్మ ఎదురుగా ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో 10 షాపులు ఉండగా ఎస్సీలకు 1 ,మిగిలిన 9 ఇతరులకు కేటాయించారు. మునిసిపల్ స్టేడియం వద్ద 55 షాపులు ఉండగా ఎస్సీలకు 8, ఎస్టీలకు 3, దివ్యాంగులకు 2 , ఇతరులకు 42 షాపులు కేటాయించారు. నటరాజ్ థియేటర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 7 షాపులు ఉండగా 1 ఎస్సీలకు మిగిలిన 6 ఇతరులకు కేటాయించారు. ఎస్‌కేవీటీ స్కూల్ వద్ద 7 షాపులు ఉన్నాయి. బైపాస్ రోడ్డులో 45 షాపులు ఉండగా అందులో పది ఖాళీగా ఉన్నాయి. మిగిలినవాటిలో 7 ఎస్సీలకు, 3 ఎస్టీలకు ,10 షాపులు దివ్యాంగులకు, 15 షాపులను ఇతరులకు కేటాయింపులు చేశారు.

అడిషనల్ ఎస్పీగా శ్రీనివాసులు



రాజమహేంద్రవరం, ఆగస్టు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా అడిషనల్ ఎస్పీ (క్రైమ్స్)గా కె.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఇప్పటి వరకూ నార్త్ జోన్ డీఎస్పీగా విధులు నిర్వర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా పలువురు డీఎస్పీలకు ఉద్యోగోన్నతి కల్పించారు.దీనిలో భాగంగా శ్రీనివాసులును అడిషనల్ ఎస్పీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో మంచి అధికారిగా పేరుతెచ్చుకున్నారు.అడిషనల్ ఎస్పీ(అడ్మిన్)గా విధులు నిర్వర్తిస్తున్న ఎస్.రాజశేఖరరావు,ఎక్సైజ్ (పాత సెబ్) అడిషనల్ ఎస్పీ పిట్టా సోమశేఖరరావుకు ఎస్పీ(నాన్ క్యాడర్)గా ఉద్యోగోన్నతి కల్పించారు. రాజశేఖర రావును ఏసీబీకి, సోమశేఖరరావును కాకినాడ జిల్లా ఏపీఎస్పీ మూడో బెటాలియన్ కమాండెంట్‌గా బదిలీ చేశారు.ప్రభుత్వ రైల్వే పోలీసు రాజమహేంద్రవరం సబ్-డివిజన్ డీఎస్పీ ఎల్.మోహన్‌రావుకు అడిషనల్ ఎస్పీగా ఉద్యోగోన్నతి కల్పించి అనకాపల్లి జిల్లా క్రైమ్ విభాగానికి బదిలీ చేశారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడి దుర్మరణం

8

ర్యాంపుల వద్ద చెక్‌పోస్టులు పెట్టండి : జేసీ



కొవ్వూరులో ర్యాంపు పరిశీలిస్తున్న జేసీ చిన్నరాముడు, సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు,ఆగస్టు 30 : డీసిల్టేషన్ ఇసుక ర్యాంపుల వద్ద పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటుచేయాలని జేసీ ఎస్.చిన్నరాముడు అధికారులను ఆదేశించారు. కొవ్వూరు మండలం వాడపల్లి, పట్టణ పరిధిలోని ఔరంగాబాద్, ఏరినమ్మ,ఫ్యాక్టరీ ర్యాంపు, దండకుంటరేవు ఇసుక ర్యాంపులను శుక్రవారం అధికారులతో కలిసి పరిశీలించారు. కొవ్వూరు మండలం వాడపల్లి, ఔరంగాబాద్ ఇసుక ర్యాంపుల వద్ద ఉన్న రెండు మార్గాల్లో ఒక మార్గాన్ని మూసివేయాలన్నారు. ర్యాంపులోపలికి వెళ్లే మార్గం వద్ద పోలీసు చెక్‌పోస్టుతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొవ్వూరు ఫ్యాక్టరీ ర్యాంపు ను తాత్కాలికంగా మూసివేయాలన్నారు. ఆయన వెంట ఏడీ మైన్స్ సుబ్రహ్మణ్యం, కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ఇన్ చార్జి తహశీల్దార్ కె.అజయ్‌బాబు సిబ్బంది ఉన్నారు.




టీచర్ల ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 : కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం (యూపీఎస్) రద్దు చేయాలని, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్ అరుణకుమారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోకు కేఎల్ శివజ్యోతికి వినతిపత్రం అందజేశారు. తక్షణమే కేంద్రం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.షరీఫ్, జిల్లా కార్యదర్శి ఎన్.రవిబాబు, కార్యదర్శి కె.రమేష్ బాబు, సీహెచ్ దయానిధి, వీఎస్ ప్రకాశరావు, సీహెచ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

జ్వరపీడితులకు అన్ని పరీక్షలు చేయాలి : డీఎంహెచ్‌వో

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30 : వైద్యశిబిరాల్లో జ్వరపీడితులకు అన్ని పరీక్షలు నిర్వహించి పూర్తి వివరాలు నమోదు చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరావు ఆదేశించారు. రాజమహేంద్రవరం లాలాచెరువు వాంబేగృహాల వద్ద ఏర్పాటు చేసిన ఆరోగ్య వైద్య శిబిరాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. అద్దేపల్లి కాలనీ యూపీహెచ్‌సీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు ఈ వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జగదీష్ తెలిపారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా హరినారాయణ్



రాజమహేంద్రవరం సిటీ, ఆగస్టు 30 : జిల్లా ప్రత్యేక అధికారిగా 2011 బ్యాచ్ ఐఏఎస్ అధికారి ఎం.హరినారాయణ్‌ను నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాల అమలు తీరును పరిశీలించేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లాకు ఐఏఎస్‌లను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ జీవో నెం 1495ను జారీ చేసింది. దీనిలో భాగంగా హరినారాయణ్‌ను జిల్లా స్పెషల్ ఆఫీసర్‌గా ప్రభుత్వం నియమించింది. ఆయన ప్రస్తుతం డీఎంఏగా పనిచేస్తున్నారు.

కేఎఫ్‌సీలో మరుగు నూనె వాడేస్తున్నారు..
క్యాన్సర్ వచ్చే ప్రమాదం : విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి

రాజమహేంద్రవరం,ఆగస్టు 30(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని హోటళ్లు/రెస్టారెంట్లలో మరుగు నూనెను ఎక్కువగా వాడుతున్నారని విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం వంట నూనెలో టోటల్ పోలార్ కాంపౌండ్స్(టీపీసీ) మీటరు రీడింగు 25% ఉండాలని.. కానీ రీడింగు ఎక్కువగా ఉంటున్నట్టు తమ తనిఖీల్లో బయట పడుతోందన్నారు.ఈ విధమైన నూనె వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందన్నారు. శుక్రవారం కేఎఫ్‌సీ రెస్టారెంట్, పందలపాక అప్పారావు(సత్య పంచ కళ్యాణి) పలావు హోటల్స్‌లో తనిఖీలు చేయగా రెండిటిలోనూ రీడింగు ఎక్కువగానే ఉందన్నారు. ఆహార పదార్థాల నమూనాలను ల్యాబ్‌కి పంపించడంతో పాటు కేసులు నమోదు చేశామన్నారు.కార్యక్రమంలో ఎస్ఐ జగన్నాథరెడ్డి,డీసీటీవో నవీన్‌కుమార్,ఫుడ్ ఇన్‌స్పెక్టర్ రుక్కయ్య పాల్గొన్నారు.



తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో మహిళల సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

నిడదవోలు, ఆగస్టు 30 : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోట సత్తెమ్మ ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఎస్‌వీకేపీ శర్మ సుమారు 1500 మంది ముత్తయిదువులచే వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. దేవస్థానం వారిచే ముత్తయిదువులకు పసుపు కుంకుమ గాజులు ప్రసాదం అమ్మవారి ఫొటో అందజేసారు. సుమారు 3000 మందికి అన్నప్రసాదం వితరణ చేసినట్టు ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ వి.హరిసూర్య ప్రకాష్, ఛైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

సామూహిక వరలక్ష్మి వ్రతాలు



కొవ్వూరులో సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేస్తున్న మహిళలు

కొవ్వూరు, ఆగస్టు 30: శ్రావణ మాసం నాలుగో(ఆఖరి) శుక్రవారం సందర్భంగా అమ్మవారి ఆలయాలు అన్ని భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల విశేష పూజలు, ప్రత్యేక అభిషేకాలు, సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. కొవ్వూరులోని ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆర్యవైశ్య సంఘం, వాసవి ఆర్గనైజింగ్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో వాసవీమాత ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలను చేపట్టారు. మద్దుల సత్యనారాయణ మాట్లాడుతూ వాసవి అమ్మవారి 102 గోత్రికుల నామాలతో 102 ఆకులతో రజిత వృక్షం (వెండి వృక్షం) తయారీలో ఆర్యవైశ్యులంతా భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మద్దుల సోమరాజు, నాళం శ్రీనివాసరావు, వాసవి ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కక్కిరాల సూరిబాబు, వలివేటి ప్రసాద్, దేవతు ప్రసాద్, పలుకూరి రామారావు, నూలి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెరవలి: మండలంలోని అన్నవరప్పాడులోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు.



అన్నవరప్పాడులో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

చాగల్లు: చాగల్లులోని ధనలక్ష్మమ్మ ఆలయంలో ప్రత్యేక, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహించారు. శ్రావణ మాసోత్సవాల ముగింపు సందర్భంగా భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కారుమూరి గున్నేశ్వరరావు గుప్త ఏర్పాట్లు పర్యవేక్షించారు. కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పింఛను లబ్ధిదారులు అందుబాటులో ఉండాలి

గోపాలపురం ఎంపీడీవో శ్రీదేవి

గోపాలపురం, ఆగస్టు 30: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు పొందేందుకు లబ్ధిదారులు అందుబాటులో ఉండాలని ఎంపీడీవో ఆర్.శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా 1వ తేదీన పింఛన్లు అందజేస్తుండగా సెప్టెంబరు 1వ తేదీ ఆదివారం రావడంతో ఒక రోజు ముందుగా(ఆగస్టు 31) శనివారం అందజేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. మండలంలో 9,168 పింఛన్లకు రూ.3,87,55,000 సిద్ధం చేశామని, పింపిణీకి 182 మంది సిబ్బందిని నియమించామని, వీరి పర్యవేక్షణకు 9మంది మండల స్థాయి అధికారులను నియమించినట్టు ఎంపీడీవో పేర్కొన్నారు.

పెరవలి: మండలంలోని 18 గ్రామాల్లో పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఎంపీడీవో రమేష్ తెలిపారు. అన్ని రకాల పింఛన్లు కలిపి 10,371 ఉండగా రూ.4,36,57,000 పంపిణీ చేయాల్సి ఉందని, పంపిణీ కార్యక్రమంలో 161 మంది పాల్గొంటారని చెప్పారు.

హిందు మత ధర్మాన్ని ప్రచారం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ

చాగల్లు, ఆగస్టు 30: విశ్వహిందూ పరిషత్ షష్ట్యాబ్ది మహోత్సవాల్లో భాగంగా స్థానిక కొత్తపాటెమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని సమావేశ మందిరంలో స్థాపన దివస్ నిర్వహించారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ అఖిలభారత కేంద్ర కమిటీ సభ్యుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ముఖ్యఅతిథి విచ్చేసి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మత మార్పిడిలపై చేసిన వ్యాఖ్యలను స్వాగతిస్తున్నామని, వాటిని అమలు చేయాలని కోరారు. ప్రతి మండలంలో హిందు మత ధర్మ ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో లింగాల శ్రీనివాసశర్మ, గ్రంధి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎడతెరిపిలేని వాన

పెరవలి, ఆగస్టు 30: మారిన వాతావరణ పరిస్థితులతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెడపి లేకుండా వర్షం కురిసింది. దీంతో ప్రజానికం బయటకు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. వ్యవసాయ పనులకు ఆటంకం ఏర్పడింది. మరో రెండుమూడు రోజుల పాటు ఇదే విధంగా వర్షాలు కురుస్తాయని వార్తలు వస్తుండడంతో పరిస్థితి ఏ విధంగా ఉంటుందోనని ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లంకవారిపేటలో ఉచిత వైద్య శిబిరం



పెరవలి, ఆగస్టు 30: ఖండవల్లి శివారు లంకవారి పేటలో క్రీస్తు లూథరన్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. తణుకు పట్టణానికి చెందిన సన్ ఆసుపత్రి డాక్టర్ శోభచరన్ 200 మంది రోగులను పరీక్షించారు. షుగర్, ఈసీజీ పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

నైట్ అవుట్స్ అలవెన్సులు పునరుద్ధరించాలి

కొవ్వూరు, ఆగస్టు 30: ట్రెజరీ అధికారుల వైఖరికి నిరసనగా ఆర్టీసీ ఉద్యోగులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నేషనల్ మజ్దూర్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం గ్యారేజ్ వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నైట్ అవుట్స్ అలవెన్సులు పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌డీ ముఖర్జి, శివకుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

స్పేస్ టెక్నాలజీపై విద్యార్థులకు అవగాహన

కొవ్వూరు, ఆగస్టు 30: కొవ్వూరు మండలం పంగిడి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పేస్ టెక్నాలజీపై ఇస్రో బృందం అవగాహన కల్పించింది. శ్రీహరికోట నుంచి స్పేస్ ఆన్ వీల్స్ ద్వారా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సైన్సు అండ్ టెక్నాలజీ, స్పేస్ టెక్నాలజీపై అవగాహన కల్పించడానికి ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ బస్సు శుక్రవారం పంగిడి చేరుకుంది. గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు బస్సులో టాంచింగ్ ప్యాడ్ మోడల్స్, రాకెట్ మోడల్స్, సాటిలైట్ మోడల్స్, మంగళయాన్, చంద్రయాన్, ఆదిత్య ఎల్-1లపై శ్రీహరికోట నుంచి వచ్చిన నిపుణుల బృందం విద్యార్థులకు అవగాహన కల్పించింది. కార్యక్రమంలో హెచ్‌ఎం మంగిన శ్రీరామారావు, కారింకి వెంకటలక్ష్మి, పి.సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గొడుగులు పంపిణీ

ఉండ్రాజవరం, ఆగస్టు 30: తాడిపర్రు హైస్కూల్లో కొంతమంది విద్యార్థులకు రిటైర్డ్ ప్రిన్సిపాల్ తిరుగు భీమేశ్వరరావు శుక్రవారం గొడుగులను పంపిణీ చేశారు. వర్షాకాలంలో విద్యార్థులకు ఉపయోపడే విధంగా తనవంతు సహకారం చేసినట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కె.సరోజిని, విద్యాకమిటీ ఛైర్మన్ డి.సూర్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

కొవ్వూరు, ఆగస్టు 30: వచ్చే నెల 14న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కొవ్వూరు ఇన్‌చార్జి 9వ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో ఇన్సూరెన్సు న్యాయవాదులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యే విధంగా సహకరించాలన్నారు.

మొక్కలు నాటి సంరక్షిద్దాం

- రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్
- పలుచోట్ల వనం-మనం కార్యక్రమం
- మొక్కలు నాటిన పలువురు నాయకులు, అధికారులు

నిడదవోలు/ఉండ్రాజవరం, ఆగస్టు 30: మొక్కలు పర్యావరణ పరిరక్షణకు దోహదపడతాయని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని రాష్ట్ర పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. శుక్రవారం నిడదవోలులోని జడ్పీ ఉన్నత పాఠశాల, ఉండ్రాజవరంలోని బౌద్ధ దమ్మపీఠం, మైత్రేయ బుద్ధ విహార ఆధ్వర్యంలో నిర్వహించిన వనం-మనం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతు వనం-మనం కార్యక్రమం సామాజిక చైతన్యాన్ని కలిగించేదని, ఇందులో భాగస్వాములమై పర్యావరణ పరిరక్షణలో మన వంతు బాధ్యత నిర్వహిద్దామన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో ఏకో క్లబ్స్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యార్థులకు మొక్కలు నాటడం, సంరక్షించడంపై ఆసక్తి కలుగుతుందన్నారు. ఉండ్రాజవరంలో బౌద్ధ ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బౌద్ధ విహార్‌ను మంత్రి పరిశీలించారు. దాని గుర్తింపునకు కృషి చేస్తానని అన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ప్రజలు ఇంటింటా మొక్కలు నాటాలన్నారు. అనంతరం వారిద్దరూ ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, ఎంపీడీవో పి.శామ్యూల్, తహశీల్దార్ బి.నాగరాజునాయక్, రంగా రమేష్, నీలం రామారావు పాల్గొనగా ఉండ్రాజవరంలో ఆశ్రమ పీఠాధిపతి అనాలయో, గన్నమని వెంకటసుబ్రహ్మణ్యం, కుదప చక్రపాణి, బూరుగుపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే పలు గ్రామాల్లో జరిగిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఎంపీపీ పాలాటి యల్లారీశ్వరి, ఎంపీడీవో రామకృష్ణంరాజు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరు మున్సిపాల్టీలోని కాటన్‌విగ్రహం నుంచి రైల్వేస్టేషన్ బైపాస్ రోడ్డులో నిర్వహించిన వనం మనం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, మాజీ ఎమ్మెల్యే టీవీ రామారావు విచ్చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి మాట్లాడుతూ మొక్కలు ప్రాణవాయువు(ఆక్సిజన్)ను అందించడంతో పాటు పర్యావరణాన్ని కాపాడతాయన్నారు. రత్నకుమారి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. రామారావు మాట్లాడుతూ కాలుష్యం నుంచి సమాజాన్ని కాపాడడం కోసం మొక్కలు నాటడం ఆచారంగా చేసుకోవాలన్నారు. ఒక మొక్క నాటి పదేళ్ల సంరక్షించడం ద్వారా 3.65 కోట్లు విలువచేసే ఆక్సిజన్‌ను అందజేస్తుందన్నారు. విద్యుత్ తీగలు లేని చోట మొక్కలు నాటి, సంరక్షించడం ఉద్యమంలా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంటమణి రామకృష్ణారావు, మద్దిపట్ల శివరామకృష్ణ, సూర్యదేవర రంజిత్, దాయన రామకృష్ణ, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, కండెల్లి రామారావు, కిలాని వెంకటలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ కె.డానియేల్ జోసఫ్ పాల్గొన్నారు. అలాగే కొవ్వూరు మండలం వాడపల్లిలో ఎంపీపీ కాకర్ల నారాయుడు మొక్కలు నాటి, సిబ్బందితో హరిత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.సుశీల, సర్పంచ్ గెల్లా ప్రసాద్, ఈవోపీఆర్డీ శర్మ, స్థానిక నాయకులు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఏపీవో, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు విచ్చేసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎంపీడీవో టీవీ వెంకటరమణ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడవలసిన బాధ్యత అందరిపై ఉందని, ప్రతిఒక్కరూ ఒక మొక్కనైనా నాటి సంరక్షించాలన్నారు. ఎన్‌ఆర్‌జీఎస్ ఏపీవో సీహెచ్ రమాదేవి మాట్లాడుతూ కళాశాలకు 25 కొబ్బరి మొక్కలు అందజేశామని వీటి సంరక్షణకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ గరగ శ్రీనివాసరావు, ఆర్ఐ కిషోర్, సూపరింటెండెంట్ రామారావు, అమ్మిరాజు, అధ్యాపకులు, విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని యాదవోలు, రామన్నపాలెం గ్రామ పంచాయతీల పరిధిలో చెరువు గట్టులు, పంచాయతీ కార్యాలయాలు, పాఠశాలల వద్ద మొక్కలు నాటినట్టు ఏపీవో శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకరరావు, సర్పంచ్‌లు సున్నాం వరప్రసాద్, కూచిపూడి బుల్లారావు, టీడీపీ నాయకులు నుదురుమాటి శ్రీనివాస్, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



కొవ్వూరులో మొక్క నాటిన ఎమ్మెల్యే ముప్పిడి



నన్నయ వర్సిటీలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న వీసీ శ్రీనివాసరావు



నిడదవోలులో మొక్క నాటి నీళ్లు పోస్తున్న మంత్రి దుర్గేష్



ఉండ్రాజవరంలో మొక్కలు పంపిణీ చేస్తున్న మంత్రి దుర్గేష్, బూరుగుపల్లి



తాళ్లపూడి: వేగేశ్వరపురంలో మొక్క నాటుతున్న ఎంపీడీవో, సర్పంచ్



దేవరపల్లి: యాదవోలులో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

నన్నయ ప్రాంగణాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దాలి

ఇన్‌చార్జి ఉపకులపతి శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, ఆగస్టు 30: విద్యార్థులంతా మొక్కలు నాటి వాటిని పర్యవేక్షిస్తూ నన్నయ విశ్వవిద్యాలయ ప్రాంగణాన్ని ప్రకృతి ఒడిగా తీర్చిదిద్దేందుకు కృషిచేయాలని ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. నన్నయ వర్సిటీలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. దీనికి ఇన్‌చార్జి వీసీ ముఖ్యఅతిథిగా విచ్చేసి పరిపాలన భవనం ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ మొక్కలు నాటడంతో బాటు వాటి సంరక్షణా బాధ్యతను స్వీకరించాలని చెప్పారు. పచ్చని చెట్లు ప్రగతికి సోపాన మార్గమని గుర్తెరగాలని తెలిపారు. ప్రకృతిలోని సమతులస్థితి అవసరాన్ని గుర్తిస్తూ ప్రతి నీటిబొట్టునూ సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. నన్నయ ప్రాంగణం మొత్తాన్ని వర్సిటీలోని నాలుగు కళాశాలల విద్యార్థులకు విభజించి మొక్కలు నాటించి వాటిని పరిరక్షించే కార్యక్రమం రూపొందించామని చెప్పారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి.వెంకటేశకవరరావు, ప్రిన్సిపాళ్లు ఆచార్య డి.జ్యోతిర్మయి, పి.విజయనిర్మల, ఇంజనీర్ కె.నూకరత్నం, ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు ఎం.గోపాలకృష్ణ, ఎల్.ముత్యాల నాయుడు, ఎస్.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైరల్ జ్వరాల నియంత్రణకు చర్యలు

- పలు గ్రామాల్లో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు
- అనుమానితుల నుంచి రక్త నమూనాల సేకరణ
- పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమాలు

కొవ్వూరు, ఆగస్టు 30: వైరల్ ఫీవర్స్ వ్యాప్తి అధికంగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొవ్వూరు క్రిస్టియన్‌పేట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.సుష్మ అన్నారు. జిల్లాలో జ్వరాల కేసులు పెరుగుతున్నందున డీఎంఅండ్‌హెచ్‌వో ఆదేశాల మేరకు శుక్రవారం కొవ్వూరు శ్రీరామకాలనీలో మెడికల్ క్యాంపు ఏర్పాటుచేశారు. కాలనీ ప్రజలతో జిల్లా మలేరియా ఆఫీసు స్టాఫ్, స్థానిక ఏఎన్‌ఎమ్ లలిత యాంటీ లార్వల్ చేయించారు. ఇంటింటికీ వెళ్లి దోమల లార్వా పెరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించారు. జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆసుపత్రి వైద్యులను సంప్రదించాలన్నారు. దొమ్మేరు పీహెచ్‌సీ పరిధిలోని వాడపల్లి, వేములూరు గ్రామాల్లో వైద్య శిబిరాలను నిర్వహించారు. 87 మందిని పరీక్షించి జ్వరాలతో బాధపడుతున్న 13 మంది నుంచి రక్త నమూనాలు సేకరించారు.

నల్లజర్ల: జగన్నాథపురంలో నల్లజర్ల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి 75మందికి వైద్య సేవలందించారు. అనుమానిత జ్వరపీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తెల్లం గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కాచి చలార్చిన నీటిని తీసుకోవాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. నీటి నిల్వలు, దోమల ఉధృతి లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాహిత్య, నాగరాజ్యం, జీవీవీ ప్రసాద్, స్వరూపరాణి, సుజాత పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని తాళ్లపూడి, వేగేశ్వరపురం, పోచవరం, చిడిపి గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి 18 జ్వరం కేసులు గుర్తించి వారందరికీ రక్త పరీక్షలు చేసి వైద్య సేవలుందించినట్టు తాళ్లపూడి పీహెచ్‌సీ డాక్టర్ హారికా గుప్తా తెలిపారు. మలకపల్లి పీహెచ్‌సీ పరిధిలో తిరుగుడుమెట్ట, రావూరుపాడు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి జ్వరం కేసులు గుర్తించి అవసరమైన వారిని పీహెచ్‌సీకి పంపించినట్టు డాక్టర్లు అన్నపూర్ణ, సుచందన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండడంతో జ్వరాలను నియంత్రించే చర్యల్లో భాగంగా ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటేశ్వరరావు, ఎంపీహెచ్‌ఎస్ కేఎల్ రాయ్, బి.కృపావరం, ఎంపీహెచ్‌ఈవో ఎస్.రమేష్, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



కొవ్వూరు: వాడపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం



నల్లజర్ల: జగన్నాథపురంలో శిబిరం ఏర్పాటు చేసిన వైద్య బృందం



తాళ్లపూడి: తిరుగుడుమెట్టలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న వైద్య బృందం

3న విశాఖపట్నంలో భారీ బహిరంగ సభ

విజయవంతం చేయండి.. సీపీఐ జిల్లా కార్యదర్శి మధు

రాజమహేంద్రవరం అర్బన్, ఆగస్టు 30: విశాఖ ఉక్కు కార్మికులకు సంఘీభావం తెలిపేందుకు సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో విశాఖపట్నంలో ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలు జరగనున్నాయని, ఈ సందర్భంగా ఆఖరి రోజున నిర్వహించే భారీ ప్రదర్శన, బహిరంగ సభల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. శుక్రవారం రాజమహేంద్రవరం మెరకవీధిలోని జట్ల లేబర్ యూనియన్ కార్యాలయంలో జరిగిన మేస్త్రీల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. విశాఖ ఉక్కు కార్మికులకు సంఘీభావం ప్రకటించడానికి ఉక్కు నగరంలో జాతీయ సమ్మేళనాలు జరుగుతున్నాయన్నారు. చివరి రోజున సరస్వతి పార్కు నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకూ భారీ ప్రదర్శన, అనంతరం బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. అలాగే, అధిక ధరలపై 1వ తేదీ నుంచి 6వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా ప్రచార ఆందోళనలను నిర్వహిస్తున్నామని, 6న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని తెలిపారు. సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి యువకుడి మృతి

మరొకరికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

గోపాలపురం, ఆగస్టు 30: ద్విచక్ర వాహనం అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ కె.సతీష్‌కుమార్ వివరాల ప్రకారం.. చెరుకుమిల్లి గ్రామానికి చెందిన డాకే నాగేంద్ర(30)గురువారం రాత్రి గ్రామస్థుడైన కొర్లపాటి రామకృష్ణతో కలిసి ద్విచక్ర వాహనంపై గోపాలపురం వస్తుండగా మార్గ మధ్యంలో అదుపుతప్పి పక్కకు పడిపోయారు. వాహనాన్ని నడుపుతున్న నాగేంద్రకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న రామకృష్ణకు బలమైన గాయాలు కావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. మృతుడి భార్య భార్గవి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ తెలిపారు.

కొవ్వూరులో బైక్ చోరీ

కొవ్వూరు, ఆగస్టు 30: గుర్తుతెలియని వ్యక్తులు తన మోటారుసైకిల్‌ను దొంగిలించుకుపోయారని కొవ్వూరుకు చెందిన చీపురుపల్లి సతీష్ చేసిన ఫిర్యాదుపై కేసునమోదు చేసినట్టు సీఐ పి.విశ్వం తెలిపారు. సతీష్ గత నెల 30వ తేదీ రాత్రి ఇంటి ముందు తన పల్సర్‌బైక్ పార్క్ చేశాడు. ఉదయం లేచి చూసేసరికి కనిపించలేదు. చుట్టు పక్కల వెతికినా కనిపించకపోవడంతో శుక్రవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేశారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

కొవ్వూరు, ఆగస్టు 30: వ్యక్తి అదృశ్యంపై కేసునమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరి తెలిపారు. కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన ముప్పిడి వెంకట శివ సూర్యనారాయణ లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 11వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో సరుకుల కోసం ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మూడు రోజుల తరువాత ఫోన్ చేసి మార్కెట్ బండిపై వైజాగ్ వెళ్లానని, 10 రోజుల తరువాత వస్తానని చెప్పాడని, తరువాత ఫోన్‌చేసినా ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తుందని అతడి భార్య దుర్గాభవాని పోలీసులకు ఫిర్యాదు చేసింది. బంధువుల ఇంటి వద్ద, చుట్టు పక్కల వెతికినా ఆచూకీ తెలియలేదని పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఎకరానికి సాగునీరందిస్తాం

ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు



తొక్కిరెడ్డిగూడెంలో తాడిపూడి ప్రాజెక్టు స్విచ్చాన్ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, ఆగస్టు 30: నియోజకవర్గంలో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తామని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. శుక్రవారం గోపాలపురంలోని తొక్కిరెడ్డిగూడెంలో తాడిపూడి ఎత్తిపోతల పథకానికి ఆయన స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ పథకం ద్వారా సుమారు 18 కిలోమీటర్ల మేర 13వేల ఎకరాలకు సాగునీరందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం వనం-మనం కార్యక్రమంలో భాగంగా గురుకుల పాఠశాలకు వెళ్తూ మార్గ మధ్యంలో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆపై బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలకు వెళ్లి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పలు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని విద్యార్థులు, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు.ప్రతిఒక్కరు బాధ్యతయుతంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. కాలుష్య నివారణకు మొక్కలను పెంచడమే సరైన మార్గమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఉపాధ్యక్షుడు దొరబాబు, వడ్లమూడి రమేష్, జ్యేష్ట శ్రీధర్, కాట్రగడ్డ సురేష్, వేముల నాగరాజు, నందమూరి సత్యనారాయణ, బీజేపీ మండలాధ్యక్షుడు గెల్లా శ్రీనుబాబు, తాడిపూడి డీఈ టీ.శ్రీనివాస్, ఏఈ వీ.చంద్రశేఖర్, కూనపం ప్రసాద్ బాబు, భూరెడ్డి వాసు, కొర్లపాటి రాము, కొడవటి చినవెంకటేష్, అనిశెట్టి త్రిమూర్తులు పాల్గొన్నారు.

పాత పింఛను విధానాన్ని అమలు చేయాలి

- యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయకర్
- కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

కొవ్వూరు, ఆగస్టు 30: ఏకీకృత పెన్షన్ స్కీమును రద్దు చేసి పాత పింఛను విధానం(ఓపీఎస్)ను అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.జయకర్ డిమాండ్ చేశారు. యూపీఎస్, జీపీఎస్, సీపీఎస్‌లు వద్దని, పాత పెన్షన్ విధానాన్ని అమలుపర్చాలని కోరుతూ కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం నిరసన తెలిపారు. జయకర్ మాట్లాడుతూ 2004 నుంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త పెన్షన్ పథకాన్ని అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించారు. సుప్రీంకోర్టు తీర్పును ఖాతరు చేయకుండా సీపీఎస్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. ఏపీ ప్రభుత్వం సీపీఎస్‌కు బదులుగా తీసుకువచ్చిన గ్యారంటెడ్ పెన్షన్ స్కీము (జీపీఎస్)ను ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు తిరస్కరించాయన్నారు. జీపీఎస్‌కు మరో రూపంగా ఉన్న యూపీఎస్‌ను కేంద్ర కేబినెట్ ఆగస్టు 22న ఆమోదించడం సరికాదన్నారు. కార్పొరేట్ల షేర్ మార్కెట్‌కు మాత్రమే లాభం చేకూర్చే యూపీఎస్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కొవ్వూరు డివిజన్ పరిధిలోని 9 మండలాలకు చెందిన యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్‌ఎస్ కుమార్, సీహెచ్ నాగేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, ఇమ్రాన్ బాషా, ఎన్.భవాని, గెద్దాడ జైచంద్ర, సీఐటీయూ నాయకుడు ఎం.సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.



కొవ్వూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ స్క్రీన్1	సరిపోదా శనివారం
వై.స్క్రీన్2	డిమోంటి
దేవిశ్రీ(గాయత్రి	డబుల్ ఇస్మార్ట్
అనన్య	ఆయ్
నిడదవోలు	
వీ మ్యాక్స్	డిమాట్ కాలనీ
రాధాకృష్ణ	తంగలన్
శ్రీగణపతి	ఆయ్, కమిటీ కుర్రోళ్లు
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	మిస్టర్ బచ్చన్
త్రినాథ్ సినీ మ్యాక్స్	డబుల్ ఇస్మార్ట్